

బస్సుల్లో సదుపాయాలు పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

ప్రయాణం.. సాఫ్రీగా..





- మహిళలకు ఉచిత బస్సు ప్రయాణానికి ఉమ్మడి జిల్లాలో ముమ్మర ఏర్పాట్లు
- రాష్ట్రవ్యాప్తంగా ఆగస్టు 15 నుంచి ఉచిత బస్సుల్లో తిరగడానికి ప్రభుత్వం పచ్చజెండా
- జీరో ఫేర్ టికెట్‌ను గురువారం ప్రయోగాత్మకంగా విడుదల చేసిన ఆర్టీసీ
- టికెట్ జారీపై ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కండక్టర్లు, డ్రైవర్లకు శిక్షణ ప్రారంభం
- 11 డిపోల పరిధిలో టిమ్ యంత్రాల్లోను సాఫ్ట్‌వేర్ మార్పు పూర్తి
- పథకం అమల్లోకి వస్తే ఉమ్మడి జిల్లాలో 38 లక్షల మంది మహిళలకు ప్రయోజనం

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణానికి ఉమ్మడి జిల్లాలో శరవేగంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆగస్టు 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన అయిదు రకాల బస్సుల్లో మహిళలు ఫ్రీగా ప్రయాణించేందుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఫ్రీ ప్రయాణానికి జారీ చేసే జీరో ఫేర్ టికెట్‌ను గురువారం ప్రభుత్వం విడుదల చేసింది. ఉచిత ప్రయాణం అమల్లోకి వచ్చిన తర్వాత టికెట్లు ఏవిధంగా జారీ చేయాలనేదానిపై ఉమ్మడి జిల్లాలోని 11 డిపోల్లో కండక్టర్లు, డ్రైవర్లకు ఆర్టీసీ అధికారులు గురువారం నుంచి శిక్షణ కూడా ప్రారంభించారు.

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

వైసీపీ ప్రభుత్వ అయిదేళ్ల పాలనలో అడ్డగోలుగా ఆర్టీసీ చార్జీలను పెంచేసి పేదల నడ్డి విరగ్గొట్టింది. కొద్దిపాటి దూరానికే షాక్‌కొట్టే చార్జీలు వసూలు చేసింది. అటు బయట పెట్రోలు, డీజిల్ ధరలు పెరగడంతో ప్రయాణం నరకప్రాయంగా మారింది. దీంతో ఇంటిని నడిపే ఇల్లాలి సంక్షేమం కోసం ఎన్నికలకు ముందు టీడీపీ ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని ప్రకటించింది. కూటమిని గెలిపిస్తే జిల్లాలో ఎక్కడ్నించి ఎక్కడికైనా ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేలా పథకం అమలుచేస్తామని హామీనిచ్చింది. ఈనేపథ్యంలో ఈ పథకాన్ని ఈనెల 15 నుంచి అమలు చేయనున్నట్టు ప్రభుత్వం ఇటీవల ప్రకటించింది. అయితే ఫ్రీబస్సు ప్రయాణం విభజిత జిల్లాకే పరిమితమా.. లేదా ఉమ్మడి జిల్లా వరకు అనుమతిస్తారా? అనే చర్చ జరుగుతున్న తరుణంలో ఏకంగా ప్రభుత్వం మహిళలకు బంపర్ ఆఫర్ ప్రకటించింది. ఉమ్మడి జిల్లా స్థానంలో ఏకంగా రాష్ట్రవ్యాప్తంగా ఉచితంగా మహిళలకు బస్సు ప్రయాణం చేయవచ్చని ప్రకటించింది. పల్లె వెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణించవచ్చని ఆర్టీసీ ఎండీ ద్వారకాతిరుమలరావు బుధవారం అధికారికంగా ధ్రువీకరించారు. ఈనేపథ్యంలో మరో రెండు వారాల్లో అమలుకానున్న ఈ పథకానికి గురువారం నుంచి ఉమ్మడి జిల్లాలోని 11ఆర్టీసీ డిపోల్లో అధికారులు ఏర్పాట్లు ముమ్మరం చేస్తున్నారు. ప్రధానంగా ఫ్రీబస్‌కు సంబంధించి జీరో ఫేర్ టికెట్ జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అంటే ఫ్రీ బస్సు ఎక్కిన మహిళలకు ప్రభుత్వం టికెట్ ఇస్తుంది. కానీ డబ్బులు చెల్లించక్కర్లేదు. టికెట్‌లో మాత్రం ప్రయాణిస్తున్న దూరానికి చార్జీ ఎంత అని కనిపిస్తుంది. అందులోనే ఆ మొత్తం రాష్ట్రప్రభుత్వ రాయితీగా చూపించి, చెల్లించాల్సిన చార్జీ సున్నాగా టికెట్‌లో ఉంటుంది. తద్వారా అసలు ఈ పథకం కింద ఎంతమంది మహిళలు ప్రయాణిస్తున్నారు? అనేది తెలుసుకోవడానికి వీలుగా ఈ టికెట్‌ను ఆర్టీసీ జారీచేయనుంది. దీనికి సంబంధించి గురువారం నమూనా టికెట్‌ను ఆర్టీసీ తొలిసారిగా విడుదల చేసింది. అయితే పథకం అమలయ్యాక జీరో ఫేర్ టికెట్ ఏవిధంగా కొట్టాలి? అనే దానిపై గురువారం నుంచి ఉమ్మడి జిల్లాలోని 11 డిపోల్లోని కండక్టర్లు, డ్రైవర్లకు ఆర్టీసీ అధికారులు శిక్షణ ప్రారంభించారు. అలాగే ఆయా డిపోల్లోని టికెట్ జారీ యంత్రాల(టిమ్) సాఫ్ట్‌వేర్‌ను సైతం మార్చే ప్రక్రియ పూర్తయింది. అలాగే పథకం అమలైన తర్వాత బస్సుల్లో మహిళా ప్రయాణికుల రద్దీ భారీగా పెరగనుంది. ఈ క్రమంలో మహిళా ప్రయాణికుల పట్ల ఏవిధంగా ప్రవర్తించాలి, ఘర్షణ పడకుండా ఏ విధంగా సంయమనం పాటించాలనే అంశాలపై అన్ని డిపోల్లోని 2,100 మంది సిబ్బందికి శిక్షణ ప్రారంభించారు.

అన్నీ ముస్తాబు..

ఉమ్మడి జిల్లాలో 11 ఆర్టీసీ డిపోల పరిధిలో మొత్తం 876 బస్సులున్నాయి. ఇందులో 532 పల్లెవెలుగు, అల్ట్రాపల్లెవెలుగు బస్సులు ఉన్నాయి. జిల్లాల వారీగా చూస్తే కాకినాడ జిల్లాలో 291 బస్సులుండగా, అందులో పల్లె వెలుగు, ఆల్ట్రాపల్లె వెలుగు 191, కోనసీమలో 300 బస్సులకు 176 పల్లెవెలుగు, తూర్పుగోదావరిలో 285బస్సులకు పల్లె వెలుగు, ఆల్ట్రాపల్లె వెలుగు ఉన్నాయి. అటు ఎక్స్‌ప్రెస్ బస్సులు వంద వరకు ఉన్నాయి. వీటన్నింటిలోనూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలుకానుంది. అయితే పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు ఉమ్మడి జిల్లా పరిధిలో తిరుగుతుండగా, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులు రాష్ట్రవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో తిరుగుతున్నాయి. వీటిలో మహిళలు ఉచితంగా ఎక్కడికైనా ప్రయాణించొచ్చు. పథకం అమలయ్యాక బస్సుల్లో రద్దీ పెరిగి లోడ్ ఎక్కువవుతుందని గుర్తించిన అధికారులు ఆయా బస్సుల్లో మార్పులు చేశారు. ఇప్పటికే డిపోల్లో ఈ ప్రక్రియ చివరకు వచ్చింది. కాగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఉచిత బస్సు ప్రయాణం 38 లక్షల మంది మహిళలకు ప్రయోజనం చేకూర్చనుంది. అయితే పథకం అమలయ్యాక డిమాండ్ మేరకు ఎక్స్‌ప్రెస్, మెట్రో బస్సుల సంఖ్యను పెంచే అవకాశం ఉంది.



జాతీయ జూనియర్ మహిళల హాకీ పోటీల్లో పాల్గొనేందుకు కాకినాడకు వచ్చిన ఇతర రాష్ట్రాల క్రీడాకారిణులు

జాతీయ జూనియర్ మహిళల హాకీ చాంపియన్‌షిప్

నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

- జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

కార్పొరేషన్(కాకినాడ), జూలై 31(ఆంధ్రజ్యోతి): కాకినాడలో జరగనున్న హాకీ టోర్నమెంట్ నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. కాకినాడ జిల్లా క్రీడా మైదానం వేదికగా ఆగస్టు 1 నుంచి 12 వరకు జాతీయ జూనియర్ మహిళల హాకీ చాంపియన్‌షిప్ పోటీలు జరగనున్నాయన్నారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా అధికార యంత్రాంగం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న నేపథ్యంలో అందుకు తగినట్లుగా పటిష్ట ఏర్పాట్లు చేశామన్నారు. ఎక్కడా ఏ ఇబ్బందులు తలెత్తకుండా ప్రతి అంశంపై ప్రత్యేక దృష్టి పెట్టి పని చేశామన్నారు. ఇందుకు ఆయా శాఖాల అధికారులకు విధులు కేటాయించినట్లు వెల్లడించారు. సామాన్యులకు ఇబ్బందులు తలెత్తకుండా ట్రాఫిక్ నియంత్రణ చేపట్టామన్నారు. ఆస్ట్రోటర్ఫ్ హాకీ ఫీల్డ్‌లో జరగనున్న ఈ హాకీ టోర్నీకు దేశవ్యాప్తంగా ఉన్న 500మంది క్రీడాకారులు, 200మంది సహాయక సిబ్బంది పాల్గొంటారన్నారు. శుక్రవారం జాతీయ జూనియర్ మహిళల హాకీ ఛాంపియన్‌షిప్ ప్రారంభోత్సవ కార్యక్రమం జరుగుతుందన్నారు.

క్రీడాకారులకు వసతి ఇలా..

ఈ క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు ఇప్పటికే 18 రాష్ట్రాలకు చెందిన టీములు కాకినాడ చేరుకున్నాయని, మరిన్ని టీములు శుక్రవారం ఉదయం నాటికి చేరుకుంటాయని కలెక్టర్ తెలిపారు. క్రీడాకారులు, సహాయక సిబ్బందికి సామర్లకోట ఈటీసీ, సర్వే ట్రైనీ సెంటర్, టీటీడీసీ క్యాంపస్, కాకినాడ అంబేడ్కర్ హాస్టల్, మహిళల పాలిటెక్నిక్, జేఎన్టీయూ ఉమెన్స్ హాస్టల్‌లో వసతి ఏర్పాటు చేశామన్నారు. మ్యాచ్‌లు జరిగే చోటే క్రీడాకారులకు అల్పాహారం, భోజనం సిద్ధం చేస్తామన్నారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

హాకీ టోర్నీని సమర్థవంతంగా, సజావుగా నిర్వహించేందుకు ప్రత్యేకంగా కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేశామన్నారు. ఇది జూలై 30 నుంచి ఆగస్టు 20 వరకు పనిచేస్తుందన్నారు. 24 గంటలు పద్ధతిలో మూడు షిఫ్ట్‌ల్లో సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. ఈ కంట్రోల్ రూమ్‌కు సెట్రాజ్ సీఈవో ఉదయం 10గంటల నుంచి రాత్రి 10గంటల వరకు పర్యవేక్షణ అధికారిగా వ్యవహరిస్తారని, రాత్రి 10గంటల నుంచి మరుసటిరోజు ఉదయం 10గంటల వరకు భూగర్భ జలశాఖ డీడీ పర్యవేక్షణాధికారిగా ఉంటారన్నారు.

స్వాతంత్ర్య వేడుకలకు రానున్న డిప్యూటీ సీఎం



- కాకినాడ పోలీస్ పరేడ్ మైదానంలో జాతీయ జెండా ఆవిష్కరణ
- ప్రభుత్వ జీవో విడుదల

కలెక్టరేట్(కాకినాడ),జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఈనెల 15న కాకినాడ పోలీస్ పరేడ్ మైదానంలో జరిగే 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ముఖ్యఅతిథిగా ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పాల్గొంటున్నారు.ఈమేరకు గురువారం ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఈనెల 15న జరిగే కార్యక్రమంలో తొలుత పోలీసులనుంచి ఆయన గౌరవ వందనం స్వీకరిస్తారు. అనంతరం జాతీయ జెండాను ఆవిష్కరిస్తారు. జిల్లాలో అత్యుత్తమంగా పనిచేసిన ఉత్తమ ఉద్యోగులకు అవార్డులను ప్రదానం చేసి ఘనంగా సత్కరిస్తారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లాలో చేసిన అభివృద్ధి పనులు, ప్రాజెక్టులు, వివిధ పథకాల పురోగతిపై కార్యక్రమంలో ప్రజలకుప్రత్యేకంగా వివరిస్తారు.

నేడు పిఠాపురంలో ఎమ్మెల్సీ నాగబాబు పర్యటన

పిఠాపురం, జూలై 31(ఆంధ్రజ్యోతి): పిఠాపురం నియోజకవర్గంలో శుక్రవారం జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు పర్యటిస్తారని జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు తెలిపారు. పిఠాపురం రైల్వేస్టేషన్‌లో జనసేన వీరమహిళ ఏర్పాటు చేసుకున్న హేండీక్రాఫ్ట్ స్టాల్‌ను ప్రారంభిస్తారని చెప్పారు. అనంతరం పిఠాపురం ఇందిరానగర్, కొత్తపల్లి మండలం కొమరగిరి ఆనందనగరంలో అగ్నిప్రమాదంలో గృహాలు కోల్పోయిన వారికి జనసేననాయకుల సహాయంతో పునర్నిర్మిస్తున్న ఇళ్లను పరిశీలిస్తారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, జనసైనికులు, వీరమహిళలు పాల్గొనాలని కోరారు.

నేటి నుంచి ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

- జిల్లాలో 2లక్షల 73వేల మందికి రూ.118కోట్లు విడుదల
- కొత్తగా 4,763మందికి స్పౌజ్ పింఛన్లు

కలెక్టరేట్(కాకినాడ), జూలై 31(ఆంధ్రజ్యోతి): జిల్లాలో శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి ఎన్‌టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేయడానికి అధికారులు సర్వం సిద్ధం చేశారు. జిల్లాలో 2లక్షల73వేలమందికి రూ.118కోట్లు నిధులు విడుదల చేశారు. దీనిలో గండేపల్లి మండలంలో 8,429 పింఛన్‌దారులకు, గొల్లప్రోలు రూరల్ 7,680, గొల్లప్రోలు అర్బన్ 2,867, జగ్గంపేట 12,027, కాజులూరు 9,954, కాకినాడ రూరల్ 18,282మంది పింఛన్‌దారులు ఉన్నారు. కాకినాడ అర్బన్ 29,544, కరప 11.339, కిర్లంపూడి 11.132, కోటనందూరు 7,726, యూ.కొత్తపల్లి 12,495, పెదపూడి 10,437, పెద్దాపురం రూరల్ 11,620, పెద్దాపురం అర్బన్ 6039, పిఠాపురం రూరల్ 11045, పిఠాపురం అర్బన్ 5670, ప్రత్తిపాడు 11,539, రౌతులపూడి 7962, సామర్లకోట రూరల్ 11,616, సామర్లకోట అర్బన్ 6270, శంఖవరం 7555, తాళ్లరేవు 11,458, తొండంగి 12,430, తుని రూరల్ 12,261, తుని అర్బన్ 5,330, ఏలేశ్వరం రూరల్ 6661, ఏలేశ్వరం అర్బన్ 3,697మంది పింఛన్‌దారులకు పింఛన్లు ఇస్తున్నట్లు డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు తెలిపారు. స్పౌజ్ కోటాలో 2019 నుంచి 2024 అక్టోబరు మధ్య వరకు పింఛన్ పొందుతూ మరణించిన వారి భార్యలకు కూడా పింఛన్లు వచ్చాయన్నారు. జిల్లాలో 4,763మందికి రూ.1.90 కోట్లు నిధులు వచ్చాయన్నారు. వీరికి ఒక్కొక్కరికీ రూ.4వేల చొప్పున శుక్రవారం పంపిణీ చేస్తారన్నారు. జిల్లాలో ఉన్న గ్రామ, వార్డు సచివాలయం ఉద్యోగులు వీటిని ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేస్తారన్నారు.

తొలిరోజే నూరుశాతం పింఛన్ల పంపిణీ చేయాలి: జిల్లా కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ),జూలై 31(ఆంధ్రజ్యోతి): జిల్లాలో శుక్రవారంనుంచి ప్రారంభం అవుతున్న ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ తొలిరోజే నూరుశాతం పంపిణీ చేయాలని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన తన క్యాంపు కార్యాలయంనుంచి జిల్లాలో ఉన్న మండల, మున్సిపల్ అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌టీఆర్ భరోసా పింఛన్లు ఈనెలకి 2లక్షల 73వేలమందికి రూ.118కోట్లు కేటాయించారన్నారు. జిల్లాలో అదనంగా 4,763 స్పౌజ్ పింఛన్లు మంజూరయ్యాయన్నారు. కొత్తగా మంజూరు అయిన స్పౌజ్ పింఛన్లు పంపిణీ సమయంలో ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలన్నారు. పింఛన్‌దారులను సమావేశపర్చి పింఛన్లు పంపిణీ చేయడానికి ఏపీఎం, సీసీలు, సచివాలయం సిబ్బందికీ సహకరించాలన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేసి పింఛన్ల పంపిణీ విజయవంతం చేయాలన్నారు. శుక్రవారం ఉదయం 7గంటలకు పింఛన్ల పంపిణీ ప్రారంభించి ఇంటింటికీ వెళ్లి పింఛన్లు ఇవ్వాలన్నారు. ఎక్కడా ఎలాంటి అవాంతరాలు లేకుండా పింఛన్ల పంపిణీ సాగాలన్నారు.

అర్హులైన రైతులకు అన్నదాత సుఖీభవ అందేలా చర్యలు

- జిల్లా కలెక్టర్ షాన్ మోహన్

కలెక్టరేట్(కాకినాడ), జూలై 31 (ఆంధ్రజ్యోతి):జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్క రైతుకు అన్నదాత సుఖీభవ పథకం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. కలెక్టర్ తన క్యాంపు కార్యాలయంనుంచి అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకం అమలుపై మండలస్థాయి అధికారులతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 2న అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకం కింద జిల్లాలో 1,48,000మంది రైతులకు రూ.98.80కోట్లు జమ చేస్తామన్నారు. తొలివిడతలో రాష్ట్ర ప్రభుత్వం రూ.5 వేలు, కేంద్రప్రభుత్వం రూ.2వేలు కలిపి మొత్తంగా రూ.7వేలు రైతులకు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమాన్ని మండల, గ్రామస్థాయిలో ఒక పండుగ వాతావరణంలో నిర్వహించాలన్నారు. ప్రజాప్రతినిధులు, రైతులను భాగస్వాములను చేయాలన్నారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించాలన్నారు. కాన్ఫరెన్స్‌లో జిల్లా వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకులు విజయ్‌కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

'పీజీఆర్‌ఎస్‌వద్ద మూడు కౌంటర్లు ఏర్పాటు చేయాలి'

కలెక్టరేట్(కాకినాడ), జూలై 31(ఆంధ్రజ్యోతి): కాకినాడ కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్‌ఎస్) వద్ద మూడు కౌంటర్లు ఏర్పాటుచేయాలని మూవ్‌మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం సంస్థ ఏపీ సుప్రీం కౌన్సిల్ సభ్యుడు షేక్‌హుస్సేన్ జేసీ రాహుల్‌మీనాకు వినతిపత్రం ఇచ్చారు. పీజీఆర్‌ఎస్‌వద్ద సరైన ఏర్పాట్లు చేయకపోవడంవల్ల ఈనెల 28న జరిగిన పీజీఆర్‌ఎస్ కార్యక్రమం వద్ద ప్రజలు తోసుకున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో ఒకటో కౌంటరు దివ్యాంగులకు, రెండో కౌంటరు వృద్ధులు, మహిళలకు, మూడో కౌంటరు వద్ద సాధారణ పౌరులకు దరఖాస్తులను పంపిణీ చేయాలని కోరారు. ఎండ నుంచి రక్షణ పొందడాకి టెంట్‌లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

'కేబుల్ వైర్లవల్ల ప్రమాదాలు'

జిల్లాలో పట్టణాలు, గ్రామాల్లో ఇష్టారాజ్యంగా కొంతమంది కేబుల్ ఆపరేటర్లు కేబుల్ వైర్లు స్తంభాలకు వేలాడదీయడం వల్ల పలు ప్రమాదాలు జరుగుతున్నాయని మూవ్‌మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ జిల్లా అధ్యక్షుడు మొహమ్మద్‌హలీమ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు జేసీ రాహుల్‌మీనాకు ఒక వినతిపత్రం ఇచ్చారు. విద్యుత్ స్తంభాలకు కాకుండా ప్రత్యేక స్తంభాలకు కేబుల్ వైర్లు బిగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

8మంది వేద పాఠశాల విద్యార్థులకు అస్వస్థత

- గొంతు నొప్పి, కడుపు నొప్పితో ఇబ్బందులు
- అన్నవరం దేవస్థానం ఆస్పత్రిలో ప్రాథమిక వైద్యం
- మెరుగైన వైద్యం కోసం తుని ఏరియా ఆస్పత్రికి తరలింపు
- పరిస్థితిపై ఆరా తీసిన డీఎంహెచ్‌వో

అన్నవరం/తునిరూరల్, జూలై 31(ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్మార్త ఆగమ పాఠశాల విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. 8మంది విద్యార్థుల పరిస్థితి విషమంగా ఉండడంతో వీరిని దేవస్థానం ఆస్పత్రికి తరలించి చికిత్స అందించి అక్కడినుంచి మెరుగైన వైద్యంకోసం తుని ఏరియా ఆస్పత్రికి తరలించారు. 8మంది విద్యార్థులను ఎమర్జెన్సీ వార్డుకు తరలించి ఏరియా ఆస్పత్రి వైద్యులు వైద్యచికిత్స అందిస్తున్నారు. విషయం తెలుసుకున్న డీఎంహెచ్‌వో తుని ఏరియా ఆస్పత్రికి తరలివచ్చి మెరుగైన వైద్యసేవలకు సంబంధించి వైద్యులకు పలు సూచనలు ఇచ్చారు. ఈ విద్యార్థులు రెండురోజులక్రితం అన్నవరం దేవస్థానం దిగువన కిర్లంపూడి సత్రంలో దత్త హోమంలో పాల్గొని అక్కడ అన్నప్రసాదం స్వీకరించినట్లు సమాచారం. ఆ అన్నప్రసాదమే వికటించి తీవ్రమైన గొంతు నొప్పి, కడుపు నొప్పితో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు తెలిసింది.

ఎరువుల ధరల.. షాక్

- పెరిగిన కాంప్లెక్సు ఎరువుల ధరలు
- రూ.50నుంచి రూ.330 వరకూ పైకి..
- పొటాష్ ధర అదే బాటలో..
- యూరియా, డీఏపీ పాత ధరలే
- ఉమ్మడి 'తూర్పు' రైతులపై రూ.100కోట్ల అదనపు భారం
- ఇప్పటికే డీలర్ల వద్ద పాత ధరల స్టాకు
- వాటిని పూర్వ ధరకే విక్రయించాలని వ్యవసాయశాఖ ఆదేశాలు



(పిఠాపురం-ఆంధ్రజ్యోతి)

ఖరీఫ్ సాగు ప్రారంభంలోనే రైతులకు షాక్ తగిలింది. ఇప్పటికే విత్తనాలు ధరలు, కూలీల రేట్లు పెరుగుదలతో ఇబ్బంది పడుతున్న రైతులపై ఎరువుల రూపంలో భారం పడింది. పలు రకాల కాంప్లెక్సు ఎరువుల ధరలను పెంచుతూ ఆయా కంపెనీలు నిర్ణయం తీసుకున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిసరుకుల ధరల పెరగడమే ఇందుకు కారణం. రైతులు అధికంగా వినియోగిస్తున్న యూరియా, డీఏపీ ధరలు పెరగకపోవడం ఉపశమనంగా మిగిలింది. ఈ పెంపు కారణంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని రైతులపై ఏటా రూ.100కోట్లు వరకూ అదనపు భారం పడే అవకాశం ఉంది.

పంటలసాగుకు ఖర్చు పెరిగి, దిగుబడులు తగ్గి ఇబ్బందులు పడుతున్న రైతులపై మరో భారం పడింది. అంతర్జాతీయ మార్కెట్‌లో పొటాష్, ఫాస్ఫరస్ సహా పలు రకాల ముడి సరుకులు ధరలు అధికం కావడంతో ఎరువుల ధరలను పెంచుతూ తయారీ కంపెనీలు నిర్ణయం తీసుకున్నాయి. ప్రస్తుత ఖరీఫ్‌నుంచే పలు రకాల కాంప్లెక్సు ఎరువులతో పొటాష్ సంబంధిత ఎరువుల ధరలను రూ.50నుంచి రూ.330 వరకూ పెంచారు. దీంతో సాగులో ఎరువుల ఖర్చులు పెరగనున్నాయి. ఇప్పటికే విత్తనాల ధరలు, కూలీల రేట్లు, ఇతర సాగు ఖర్చులు గణనీయంగా పెరిగాయి. ఇప్పుడు ఎరువుల ధర పెరగడం రైతులకు షాక్‌గా మారింది. యూరియా, డీఏపీ ధరలను మాత్రం పెంచలేదు. యూరియా ధరలు కేంద్రప్రభుత్వం నియంత్రణలో ఉండడంతోపాటు వీటి తయారీకి భారీగా సబ్సిడీ ఇస్తోంది. డీఏపీ ధరలను యథాతథంగా ఉంచారు. రైతులు వినియోగించే ఎరువుల్లోయూరియా, డీఏపీ వాటయే 70శాతం వరకూ ఉంది.

పెంచకున్నా అదనపు భారమే

మార్కెట్‌లో యూరియా 45కిలోల బస్తా ధర రూ.266.5 ఉండగా, దీని డిమాండ్ దృష్టిలో ఉంచుకుని డీలర్లు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. కంపెనీలు, హోల్‌సేలర్ల నుంచే రవాణా సహా అన్నిఖర్చులు కలిపి ఎమ్మార్పీకి మించి డీలర్లకు వస్తుండడంతో రూ.300 వరకూ విక్రయిస్తున్నారు. డీఏపీ 50కిలోల బస్తా ధర రూ.1350 ఉండగా, దీన్ని అధిక ధరలకు విక్రయించడం లేదా లింక్ మందులు కొంటేనే అమ్ముతామనే షరతులు విధిస్తున్నారు. సొసైటీలు, రైతు సేవాకేంద్రాల్లో ఎరువుల నిల్వలు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయశాఖ ప్రకటిస్తున్నా పూర్తిస్థాయిలో లేకపోవడంతో రైతులు ప్రైవేటు డీలర్లపైనే ఆధారపడాల్సి వస్తోంది. దీంతో యూరియా, డీఏపీ ధరలు పెరగకున్నా ధరల భారం తప్పడం లేదు.

ధరల పెరుగుదల ఇలా..

కాంప్లెక్సు, పొటాష్ ఎరువుల్లో పెరుగదల ఉంది. ఇందులో అధికంగా మ్యూరేట్ ఆఫ్ పొటాష్(ఎంఓపీ) ఎరువు ధర పెరిగింది. పొటాష్ ఎరువు ధర 50కిలోల బస్తాకు రూ.250 నుంచి 265 వరకూ పెరిగింది. గతేడాది రూ.1535గా ఉన్న పొటాష్‌బస్తా ధర ఇప్పుడు రూ.1800కి చేరుకుంది. 2023లో దీని ధర రూ.1400గా ఉంది. 20-20-0-13 కాంప్లెక్సు ఎరువు ధర రూ.1300 నుంచి 1350-1425 వరకూ(ఆయా కంపెనీల ధరలకు అనుగుణంగా) పెరిగింది. 10-10-26 కాంప్లెక్సు ఎరువు ధర రూ.1470-1600 నుంచి రూ.1800-1850కి పెరిగింది. 14-35-14 ఎరువు రూ.1800 నుంచి 1900కి పెరగ్గా, 16-16-16 ఎరువు రూ.1450-1475నుంచి రూ.1600కి 12-32-16 ఎరువు రూ.1470నుంచి రూ.1720కి, 15-15-15-0-9 ఎరువు రూ.1450నుంచి రూ.1600కి, 16-20-0-13 ఎరువు ధర రూ.1250 నుంచి రూ.1300కు 24-24-0 ఎరువు ధర రూ.1700 నుంచి రూ.1800కు, 14-35-14 ఎరువు ధర రూ.1700 నుంచి రూ.1800 వరకూ పెరిగాయి.

పంటల సాగుపై భారం

జిల్లాలో వరిపంట 89,984 హెక్టార్లల్లో, కోనసీమ జిల్లాలో 65,940 హెక్టార్లు, తూర్పుగోదావరి జిల్లాలో 76,941 హెక్టార్లల్లో సాగువుతోంది. ప్రస్తుతం వరినారుమడులు, నాట్లు వేసే పనులు సాగుతున్నాయి. నారుమడి వేసిన దగ్గర నుంచి ఎరువుల వినియోగం ప్రారంభమవుతుంది. సార్వాతోపాటు అదే విస్తీర్ణంలో రబీలో వరితోపాటు ఇతర పంటలు సాగవుతాయి. రబీలో ఎరువుల వినియోగం కొంచెం ఎక్కువ ఉంటుంది. ఎరువుల ధర పెంపువల్ల ఖరీఫ్, రబీ సీజన్‌లకు కలుపుకుంటే రూ.100కోట్లు వరకూ అదనపు భారం పడే అవకాశం ఉంటుంది.

డీలర్ల వద్ద పాత స్టాకు

కంపెనీలు కాంప్లెక్సు ఎరువుల ధరలను పెంచకముందే పలువురు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా ఉన్న ఎరువులు విక్రయించే డీలర్లు స్టాకులు తెప్పించుకున్నారు. ఇవి ఇంకా డీలర్ల వద్దే ఉన్నాయి. ఇలా డీలర్ల వద్ద కాంప్లెక్సు ఎరువుల పాత స్టాకు పాత ధరలకే విక్రయించాలని వ్యవసాయశాఖ ఆదేశాలు జారీ చేసింది. డీలర్లవారీగా ఏయే ఎరువులు ఎంత ఉన్నాయో ఆశాఖ అధికారులు నివేదికలు తీసుకున్నారు. ఆ స్టాకును పాత ధరలకే విక్రయించేలా చర్యలు తీసుకున్నామని అధికారులు తెలిపారు.ఇప్పటినుంచి వచ్చే స్టాకును కొత్త ధరలకు విక్రయించాల్సి ఉంటుందన్నారు. పాతస్టాకును కొత్త ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.



ఆమె కుంచె పట్టిందంటే చాలు... ఏ చిత్రాన్ని అయినా క్షణాల్లో ఆవిష్కరిస్తుంది. పెన్సిల్ స్కెచ్, రంగులు, రంగోలి, బ్లడ్ ఆర్ట్, పోర్ట్రయిట్ స్కెచ్... ఏదైతేనేమి ఆమె చేతిలో పడితే చాలు చూడచక్కని చిత్రం రూపుదిద్దుకుంటుంది. చిత్రలేఖనంలో నైపుణ్యం సంపాదించుకుని ఎంతో సృజనాత్మకంగా బొమ్మలు వేస్తూ అందరి అభినందనలు అందుకుంటోంది. సహజత్వం ఉట్టిపడేలా కళాత్మకంగా వేస్తున్న చిత్రాలు వహ్వా అనిపిస్తున్నాయి. ఈ బహు రూప చిత్రాల రూప శిల్పి **కామిరెడ్డి రూప.**





అపురూప చిత్రాలు

చిత్ర కళలో రాణిస్తున్న కామిరెడ్డి రూప


కుంచెకు రంగులద్దుతున్న రూప

కడియం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా కడియం మండలం దుళ్ల గ్రామానికి చెందిన కామిరెడ్డి రూప అత్తారిల్లు అయిన బుర్రిలంకలో స్థిరపడింది. గృహిణి అయినప్పటికీ చిత్రకళపై ఉన్న మక్కువతో బీఎస్సీ (ఫ్యాషన్ టెక్నాలజీ) చదివింది. అక్కడ చిత్రకళలో మెళకువలు నేర్చుకుని దానికి తన ప్రతిభను జోడించి చిత్రవిచిత్రంగా బొమ్మలు వేస్తూ ఆకట్టుకుంటోంది. రంగురంగుల ముగ్గులతో అద్భుత కళాఖండాలు ఆవిష్కరిస్తూ రంగోలి కళకు ప్రాభవాన్ని తీసుకొస్తోంది. రంగులతో వినాయకుడు, వేంకటేశ్వరస్వామి, పార్వతీ పరమేశ్వరులు, శ్రీకృష్ణుడు, దుర్గాదేవి వంటి దేవుని చిత్రాలతో పాటు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, ఛత్రపతి శివాజీ, గాంధీజీ వంటి మహనీయుల బొమ్మలు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ వంటి రాజకీయ నాయకుల చిత్రాలను తీర్చిదిద్దుతున్నారు. పక్షులు, జంతువులు, సెలయేర్లు, ప్రకృతి బొమ్మలతో పాటు ఊహాత్మక చిత్రాలనూ గీస్తోంది. ఈమె చిత్రాల్లో జీవకళ ఉట్టిపడుతుంది. పెన్సిల్ ఆర్ట్, గ్లాస్ పెయింటింగ్, నఖచిత్రాలను ఔరా అనిపించే రీతిలో వేస్తోంది. శారీ పెయింటింగ్ కూడా చేస్తోంది. అందమైన చిత్రాలు, కళాఖండాలతో అబ్బురపరుస్తోంది రూప.






తాను గీసిన చిత్రాలతో రూప


అమరావతి వీధి చిత్రకళా ప్రదర్శనలో రూపను అభినందిస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

అవార్డులు... ప్రశంసలు



'సెల్యూట్ టు ఇండియన్ సోల్జర్స్-సిందూర్' పేరిట నిర్వహించిన నేషనల్ ఆర్ట్ కాంపిటీషన్‌లో బెస్ట్ క్రియేటివ్ ఆర్టిస్ట్ అవార్డు అందుకుంది. కడియపులంకలో మునలమ్మ తల్లి ఆలయం వద్ద జరిగిన కాంపిటీషన్‌లో మంత్రి కందుల దుర్గేశ్ నుంచి ప్రశంసలు అందుకుంది. రాజమహేంద్రవరంలో జరిగిన అమరావతి వీధి-చిత్రకళా ప్రదర్శనలో రూప చిత్రీకరించిన ఛత్రపతి శివాజీ చిత్రాన్ని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు చూసి అభినందించారు. వాడపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద రంగవల్లులతో తీర్చిదిద్దిన 8 అడుగుల వేంకటేశ్వరస్వామి చిత్రాన్ని చూసి కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, ఇతర ప్రముఖులు రూపను ప్రశంసలతో ముంచెత్తారు.

మంచి చిత్రకారిణిగా గుర్తింపు పొందాలనేది నా లక్ష్యం: రూప



చిత్రకారులకి ముందుగా పేషెన్సీ (ఓపిక), ఫ్యాషన్ ఉండాలి. చిన్నతనంలో సుద్దముక్కతో బొమ్మలు వేసేదాన్ని. అలా పెయింటింగ్‌పై ఆసక్తి కలిగింది. హైస్కూల్ స్థాయిలో పలు చిత్రాలకు బహుమతులు పొందాను. రాజమహేంద్రవరం మహిళా కళాశాలలో బీఎస్సీ ఫ్యాషన్ టెక్నాలజీ చదివాను. ప్రస్తుతం కాత్రేనికోనకు చెందిన క్రియేటివ్ ఆర్ట్స్ వ్యవస్థాపకుడు అంజి అకొండి వద్ద ఫైన్ ఆర్ట్స్‌లో డిప్లొమా చేస్తున్నాను. ఒక చిత్రం వేసేందుకు 2 నుంచి 4 గంటలు పడుతుంది. ఇలా అనేక చిత్రాలు వేశాను. చిత్రకారిణిగా మంచి గుర్తింపు పొందాలనేది నా లక్ష్యం.

అమ్మ అనే పదంలో ఆప్యాయత అనురాగం, మురిపెం అనే సుగుణాలు మిళితమై ఉన్నాయి. పుట్టిన బిడ్డకు తొలి ఆహారం, తొలి టీకా తల్లిపాలు. తల్లిపాలే పిల్లలకు అమృతం. బిడ్డ, శారీరక ఎదుగుదలకు ఇవి ఎంతగానో దోహదపడతాయి. నవజాతి శిశువుకు బలం చేకూర్చే ఆహారం తల్లిపాలే అని వైద్యులు చెప్తున్నారు. నూరు శాతం పోషక విలువలున్న తల్లిపాలు శిశువు ఆరోగ్యంగా ఎదగడంలో, ఆయుష్షు పెంచడంలో కీలక పాత్ర పోషిస్తాయి.



అమ్మపాలే అమృతం

- బిడ్డకు పాలిస్తే తల్లికి ఆరోగ్యం
- చిన్నారుల్లో రోగ నిరోధక శక్తి మెరుగు
- నేటి నుంచి 7వ తేదీ వరకు తల్లి పాల వారోత్సవాల సందర్భంగా కథనం

(ఆంధ్రజ్యోతి-అంబాజీపేట/సామర్లకోట)

తల్లిపాలు శిశువుకు సంపూర్ణమైన సంతులిత ఆహారాన్ని అందిస్తాయి. నాణ్యమైన ప్రోటీన్లు అంది మెదడు వికసిస్తుంది. ఈ పాలలో బిడ్డలకు అవసరమయ్యే విటమిన్లు పుష్కలంగా ఉంటాయి. లాక్టోజ్ వల్ల కాల్షియం నిల్వలు పెరుగుతాయి. బిడ్డను రక్తహీనత నుంచి కాపాడతాయి. తొలి నెలలో శిశువులను వివిధ రకాల అంటువ్యాధుల బారి నుంచి కాపాడుతాయి. మనోవికాసానికి తోడ్పడతాయి. మృదువైన మల విసర్జనకు, మలబద్ధకం సమస్య నివారణకు దోహదపడతాయి. జీర్ణ మండలాన్ని వృద్ధి చేస్తాయి. తల్లి పాల ద్వారా బిడ్డలను డయేరియా, న్యుమోనియా వంటి ప్రాణాంతక వ్యాధుల నుంచి కాపాడొచ్చు. క్యాన్సర్, చెవి సంబంధిత వ్యాధులు, గుండె జబ్బుల నుంచి కూడా రక్షణ కల్పిస్తాయి. ఎలర్జీ, ఆస్తమా, డయాబెటిస్ వంటి వ్యాధులు రావు. బాల్యంలో, యవ్వనంలో ఊబకాయం వచ్చే ప్రమాదం తక్కువ.

తల్లి పాలు పుష్కలంగా రావాలంటే...

గర్భిణిగా ఉన్నప్పటి నుంచే పోషక విలువలున్న ఆహారం తీసుకోవాలి. పాలు, చేపలు, గుడ్లు, వెల్లుల్లిపాయ, తాజా కూరగాయలు, పండ్లు తగిన మోతాదులో తీసుకోవాలి. ఆహారంలో తీపి పదార్థాలు అంటే సహజంగా దొరికే పండ్లను శుభ్రంగా కడిగిన తర్వాత తినాలి.

తల్లులు పాలిచ్చే సమయంలో కెఫిన్ పుష్కలంగా ఉండే కాఫీ, శీతల పానీయాలు తీసుకోవడం మంచిది కాదు. పండ్లు, కూరగాయలు, పప్పు ధాన్యాలు తీసుకోవాలి. ద్రవాహారాన్ని పుష్కలంగా తీసుకోవాలి. బీన్స్, వేరుశెనగ, అలసందలు, తృణధాన్యాలు, డ్రైఫ్రూట్స్ ఎక్కువగా తీసుకోవాలి. ఐరన్ ఉక్కువగా ఉండే ఆహారాన్ని విటమిన్-సీతో ఇచ్చే పండ్లతో కలిపి తీసుకోవడం మంచిది. గుడ్లు, పాలు, పాల ఉత్పత్తులు, బఠానీలు, నట్స్ వంటివి తీసుకోవాలి.

తల్లికి బోలెడు లాభాలు...

శిశువుకు ముర్రుపాలు ఇవ్వడం వల్ల తల్లికి రొమ్ము, గర్భసంచి, అండాశయం మొదలగు క్యాన్సర్లు రావని వైద్య నిపుణులు చెప్తున్నారు. ప్రసవ సమయంలో స్థిరత్వం కోల్పోయిన గర్భసంచి పూర్వస్థితికి రావడం వల్ల అధిక రక్తస్రావం తగ్గుతుంది. హార్మోన్ల ప్రభావం వల్ల ఆరు నెలల వరకు అండం విడుదల కానందువల్ల గర్భధారణ జరగదు. పిల్లలకు పాలిచ్చే తల్లులు సౌందర్యవంతంగా కనిపించడంతో పాటు మానసిక రుగ్మతలు దరిచేరవు.

శిశువుకు ఎంతో మేలు...

పుట్టిన ప్రతి బిడ్డకు తల్లిపాలను ఆరు నెలల వరకు కచ్చితంగా ఇవ్వాలి. తల్లి నుంచి మొట్టమొదట వచ్చే పాలను పిల్లలకు ఇవ్వకూడదని అపోహ ఉంది. కానీ అది సరైనది కాదు. మొదట మూడు రోజులు పాటు వచ్చే పాలలో (ముర్రుపాలు) కొలస్ట్రం ఉంటుంది. ఇది బిడ్డ ఆరోగ్యానికి ఎంతో ఉపయోగకరం. కొలస్ట్రంలో ప్రోటీన్ పాళ్లు ఎక్కువగా ఉంటాయి. ఇవి బిడ్డకు రోగనిరోధక శక్తి ఇస్తాయి. తల్లి నుంచి పాల ద్వారా బిడ్డకు ఇమ్యూనోగ్లోబ్యులిన్స్ చేరతాయి. దీనిని పాజిటివ్ ఇమ్యూనిటీ అంటాం. దీంతో బిడ్డకు అంటువ్యాధులు రావు.

తల్లిపాల దినోత్సవం ఇలా మొదలైంది...

ఇటలీ దేశంలోని ఫ్లోరెన్స్ నగరంలో ఇన్నోసెంటి సెంటర్‌లో 1990 జూలై 30 నుంచి ఆగస్టు ఒకటో తేదీ వరకు అంతర్జాతీయ సమావేశం జరిగింది. తల్లిపాల విశిష్ఠతను గుర్తించిన ఆ సమావేశం ఏటా ఆగస్టు 1 నుంచి వారం పాటు తల్లిపాల వారోత్సవాలు నిర్వహించాలని నిర్ణయించింది. తల్లిపాలపై తల్లుల్లో ఉన్న అపోహలను తొలగించి, తల్లిపాల గొప్పతనం చాటి చెప్పడమే వారోత్సవాల ప్రధాన ఉద్దేశం.

అనేక పోషక విలువలు

శిశువు పుట్టిన వెంటనే తల్లి పాలు ఇవ్వాలి. ఇవి శిశువు రోగనిరోధక శక్తికి ఎంతగానో తోడ్పడతాయి. తాగే వరకు బిడ్డకు పాలు ఇస్తూనే ఉండాలి. రోజుకు కనీసం పదిసార్లు అయినా ఇవ్వాలి. ఆరు నెలలు దాటాక పాలు పూర్తిస్థాయిలో సరిపోయే అవకాశం ఉండదు. పాలు ఇస్తూనే మరోపక్క అనుబంధ పౌష్టికాహారం అందించాలి. వివిధ రకాల పోషకాలు ఉన్న ఆహారాన్ని క్రమబద్ధంగా తీసుకోవాలి. **-డాక్టర్ లక్ష్మి, గైనకాలజిస్ట్, సామర్లకోట**

తల్లీబిడ్డలకు ఆరోగ్యం



అంగన్వాడీ కేంద్రాల్లో గర్భిణులకు ముందుగానే అవగాహన కల్పిస్తున్నాం. శిశువు జన్మించాక వీలైనంత త్వరగా ముర్రుపాలు ఇవ్వాలని చెప్తున్నాం. ఇది తల్లి, బిడ్డకు ఆరోగ్యకరం. బిడ్డకు ఆరు మాసాలు వచ్చే వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలి. బిడ్డకు అవసరమైన శక్తి తల్లిపాల ద్వారానే వస్తుంది.

వై.విజయశ్రీ, సీడీపీవో, ఐసీడీఎస్ పి.గన్నవరం ప్రాజెక్టు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

తల్లి పాల విలువపై అవగాహన కల్పిస్తాం



గర్భిణులకు, బాలింతలకు తల్లిపాల వల్ల కలిగే ఉపయోగాలపై వారోత్సవాల్లో అవగాహన కల్పిస్తాం. అంగన్వాడీ కార్యకర్త నుంచి మహిళా-శిశు సంక్షేమ శాఖలో పనిచేస్తున్న వారంతా తల్లిపాల విశిష్టతను చాటి చెప్తారు. వైద్య-ఆరోగ్య శాఖకు చెందిన వైద్యులు, ఇతర సిబ్బందితో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటుచేస్తాం.

సీహెచ్ లక్ష్మి, ఐసీడీఎస్ పీడీ, కాకినాడ జిల్లా

మహిళాభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కృషి

- రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, సెర్ప్, ఎన్ఆర్ఐ సాధికారిత శాఖల మంత్రి శ్రీనివాస్


కడియంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో మంత్రి శ్రీనివాస్, గోరంట్ల

కడియం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మహిళ బాగుంటే.. ఆ కుటుంబం బాగుంటుంది.. అనే ఉద్దేశంతో మహిళాభ్యున్నతికి కూటమి ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, సెర్ప్, ఎన్ఆర్ఐ సాధికారిత శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. గురువారం కడియంలో ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ఆధ్వర్యంలో ఏడాది 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ మహిళల ఆరోగ్యం దృష్ట్యా గతంలోనే రూ. 10 వేల విలువ చేసే దీపం పథకాన్ని ఎంతోమంది మహిళలకు ఆనాడు సీఎం చంద్రబాబునాయుడు అందజేశారన్నారు. సీఎం చంద్రబాబునాయుడు 30 ఏళ్ల కిందటే రూ.10 వేలు పొదుపు ఇస్తాం.. మీరు రూ.10 వేలు కలిపి అభివృద్ధి చెందండి అని పదిమంది మహిళా సభ్యులతో డ్వాక్రా సంఘాన్ని రాష్ట్రంలో ప్రవేశపెట్టారని, అటువంటి డ్వాక్రా సంఘాలు ఐదేళ్ల తరువాత దేశంలో అన్ని రాష్ట్రాల్లో నెలకొల్పారన్నారు. ప్రతీ ఏటా లక్ష మంది పారిశ్రామికవేత్తలను తయారుచేయాలని సీఎం చంద్రబాబునాయుడు ఆదేశాలు ఇచ్చారన్నారు. అందుకోసం మహిళలకు రుణాలు ఇప్పించడంతో పాటు వారికి శిక్షణ ఇప్పిస్తున్నట్టు తెలిపారు. వారి పిల్లల చదువుకోసం, వివాహాల కోసం, ఆరోగ్యం కోసం ఇలా స్త్రీనిధి కింద మహిళలకు రూ.లక్ష ఇవ్వడం జరుగుతుందన్నారు. కూటమి ఏర్పడిన ఏడాది కాలంలో గత నాలుగు నెలలుగా రాష్ట్ర వ్యాప్తంగా 27 వేల కోట్లు రుణాలు ఇవ్వడం జరిగిందన్నారు. మొత్తం 90 వేల కోట్ల రుణాలు మహిళలకు ఇవ్వనున్నామన్నారు. అలాగే అర్హులైన ప్రతీ ఒక్కరికి రూ.4 వేలు, దివ్యాంగులకు రూ.6 వేలు, దీర్ఘకాలిక సమస్యలు ఉన్న వారికి రూ.10 వేలు, మంచానికే పరిమితమైన వారికి రూ.15 వేల పెన్షన్‌ను ప్రభుత్వం అందిస్తోందన్నారు. రైతులకు ఆగస్టు నెల నుంచి రూ.7 వేల చొప్పున 2 దఫాలుగాను, ఓ దఫా రూ.6 వేల చొప్పున మొత్తం రూ. 20 వేలను ప్రభుత్వం అందిస్తోందన్నారు. వైద్యం కోసం సీఎం రిలీఫ్ ఫండ్ కింద కోట్లాది రూపాయలను ప్రభుత్వం అందిస్తోందన్నారు. గ్రామాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని, కూటమి పాలనలో ఇప్పటివరకు ప్రతీ గ్రామంలో రూ.25 లక్షల నుంచి రూ. 50 లక్షల అభివృద్ధి జరిగిందన్నారు. గత ప్రభుత్వంలో పెట్టుబడులు పెట్టడానికి వచ్చేవారిని బెదరగొట్టి పెట్టుబడులు రాకుండా చేశారని, అయితే కూటమి ఏర్పడిన ఏడాది కాలంలో రాష్ట్రానికి రూ. 8 లక్షల కోట్లు పెట్టుబడులు వచ్చాయన్నారు. హైదరాబాదులో హైటెక్ సిటీ మాదిరిగా ప్రస్తుతం అమరావతి అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. గతంలో ఒక్క చాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన నాయకుడి వల్ల 20 ఏళ్ల రాష్ట్రాభివృద్ధి వెనుకకుపోయిందని మంత్రి శ్రీనివాస్ ఆరోపించారు.

స్కిల్ డెవలప్‌మెంట్, పీఏసీఎస్ డిజిటలైజేషన్‌లో ఏపీకి ప్రాధాన్యత

- ఎంపీ సతీష్‌బాబు ప్రశ్నకు కేంద్ర మంత్రుల సమాధానం

కాకినాడ సిటీ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): స్కిల్ డెవలప్‌మెంట్, పీఏసీఎస్ డిజిటలైజేషన్‌లో ఏపీకి సహాయం, ప్రాధాన్యత ఇస్తున్నట్టు రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు పార్లమెంట్‌లో అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రులు సమాధానం ఇచ్చారు. నైపుణ్యాభివృద్ధి, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల డిజిటలైజేషన్ రంగాల్లో రాష్ట్రానికి ఇస్తున్న ప్రాధాన్యపై ఎంపీ కేంద్రాన్ని ప్రశ్నించారు. దీనికి కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి జయంత్ చౌదరి సమాధానమిస్తూ ఫ్యూచర్ స్కిల్స్, డిజిటల్ టెక్నాలజీ శిక్షణలో భాగంగా కాకినాడలో ఇప్పటివరకు 192 మందికి రూ. 13.20 లక్షలు వెచ్చించి శిక్షణ ఇచ్చామన్నారు. పీఏసీఎస్ డిజిటలైజేషన్ అంశంపై కేంద్ర సహకార శాఖ మంత్రి అమిత్‌షా సమాధానమిస్తూ ఏపీలో 2037 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలుండగా, అందులో 2020 కేంద్రాల్లో ఈ ఏడాది జూన్ నాటికి ఈఆర్‌పీ వ్యవస్థ అమలులోకి వచ్చిందన్నారు. మిగిలిన 17 పీఏసీఎస్‌ల డిజిటలైజేషన్ పనులు జరుగుతున్నాయని వెల్లడించారు.

మంగళగిరి డీఐజీ ప్రత్యేక పూజలు


సుదర్శన హోమంలో పాల్గొన్న డీఐజీ లక్ష్మి దంపతులు

సర్పవరంజంక్షన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్‌లో వెలసిన రాజ్య లక్ష్మీ సమేత భావనారాయణ స్వామి వారిని గురువారం మంగళగిరి డీఐజీ ఎస్ఎస్‌జే లక్ష్మి దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీనిలో భాగంగా సుదర్శన హోమంలో పాల్గొన్నారు. వీరికి ఆలయ ఈవో టీవీ సూర్యనారాయణ ఆలయ సంప్రదాయాలతో స్వాగతం పలుకుతూ ఆలయ విశిష్ఠత, చరిత్ర గురించి వివరించారు. అనంతరం స్వామివారి చిత్రపటం, తీర్థప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

పార్మా- అకడమిక్‌లతో స్థిరమైన అభివృద్ధి

- ఆదికవి నన్నయ వర్సిటీ వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ
- స్థిరమైన వృద్ధికి ఔషధ-విద్య సమన్వయంపై అంతర్జాతీయ వర్క్‌షాప్


వీసీను సన్మానిస్తున్న అధ్యాపకులు

దివాన్‌చెరువు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఆవిష్కరణలతోనే ఔషధ పరిశ్రమ అభివృద్ధి చెందుతుందని, సామాజిక అవసరాలను పరిశోధనలు తీర్చినపుడు విద్యారంగం ఔచిత్యం పొందుతుందని ఆదికవి నన్నయ వర్సిటీ వీసీ ఆచార్య ఎస్. ప్రసన్నశ్రీ అన్నారు. దివాన్‌చెరువులోని వర్సిటీలో స్థిరమైన వృద్ధికి ఔషధ-విద్య సమన్వయం అనే అంశంపై గురువారం అంతర్జాతీయ వర్క్‌షాప్ నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వీసీ జ్యోతిప్రజ్వలన చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ స్థిరమైన ఆవిష్కరణలను పెంపొందించడానికి ఔషధ పరిశ్రమ, విద్యా పరిశోధన కలిస్తే అత్యాధునిక అవకాశాలు, సహకార మార్గాలను కనుగొనవచ్చన్నారు. పర్యా లైఫ్‌సైన్సెస్ గ్రూప్ భారత్, యూకే ఆపరేషన్స్ చీఫ్ హెచ్ఆర్ డాక్టర్ కుమార్‌రాజా చిట్టూరి మాట్లాడుతూ ఔషధ రంగంలో మానవ వనరుల ఆవశ్యకత, నైపుణ్యాభివృద్ధిపై ప్రసంగించారు. అమెరికా నుంచి ఫార్మా స్యూటికల్స్ క్వాలిటీ అస్యూరెన్స్ డైరెక్టర్ డాక్టర్ విష్ణు మారిశెట్టి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అలాగే మద్రాస్ ఐఐటీ నుంచి ప్రొఫెసర్ బీరయ్య బైరి, బయోఎగ్రికో సొల్యూషన్స్ డైరెక్టర్ బి.సతీష్‌మోహన్ హాజరై పలు విషయాల గురించి వివరించారు.కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి, వర్క్‌షాప్ కన్వీనర్ ఆచార్య బి.జగన్మోహనరెడ్డి, కో-కన్వీనర్ కె.దీప్తి, అధ్యాపకులు పాల్గొన్నారు.

అష్ట జ్యోతిర్లింగాలకు ప్రత్యేక ఆర్టీసీ సర్వీసులు

రావులపాలెం, జూలై 31(ఆంధ్రజ్యోతి): అష్ట జ్యోతిర్లింగాలు, పంచద్వారకాలకు రావులపాలెం ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక నాన్ ఏసీ, స్లీపర్ కోచ్ బస్సులు నడుపుతున్నట్టు డిపో మేనేజర్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రావులపాలెం డిపో నుంచి బయలుదేరి బసవకళ్యాణ్, తుల్జాపూర్, భీమశంకరజ్యోతిర్లింగం, పర్లిబైద్యనాథ్ జ్యోతిర్లింగం, షిర్డీ, గృష్ణేశ్వర్, జ్యోతిర్లింగం, ఎల్లోరా, నాసిక్, త్రయంబకేశ్వర జ్యోతిర్లింగం, ఢాకోర్, నిష్కలంక మహాదేవ్, బాగ్దాన, సోమనాథ్ జ్యోతిర్లింగం, నాగేశ్వరజ్యోతిర్లింగం, ద్వారక, బేట్ ద్వారక, ముదేరా, నాథద్వార్, రాజ్యసమండ కంక్రోలి, ఉజ్జయిని మహాకాలేశ్వర్ జ్యోతిర్లింగం, ఓంకారేశ్వరజ్యోతిర్లింగం, ఏకవిరిక శక్తిపీఠం, బాసర దర్శనాలు కల్పించడం జరుగుతుందన్నారు. ఈ నెల 25వ తేదీన బస్సు బయలుదేరి తిరిగి సెప్టెంబరు 8వ తేదీన రావులపాలెం డిపోకు చేరుకుంటుందన్నారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, రాత్రి టిఫిన్‌తో కలిసి టిక్కెట్టు ధర రూ. 21000గా నిర్ణయించడం జరిగిందన్నారు. మరిన్ని వివరాలకు అసిస్టెంట్ మేనేజర్ 7382911871, 9959225549 ఫోన్‌నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఎన్‌సీసీతో ఉత్తమ క్రమశిక్షణ

- ఏపీ, తెలంగాణ ఎన్‌సీసీ అధికారి నర్సింగ్ సైలాని

పెద్దాపురం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఎన్‌సీసీలో చేరితే ఉత్తమ క్రమశిక్షణ అలవడుతుందని ఐడీఎస్ఎస్‌సి, ఏపీ, తెలంగాణ ఎన్‌సీసీ అధికారి, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎయిర్ కమాండర్ నర్సింగ్ సైలాని అన్నారు. గురువారం కాకినాడ జిల్లా పెద్దాపురంలోని శ్రీప్రకాష్ సినర్జీ పాఠశాలలో జరుగుతున్న ఎన్‌సీసీ క్యాంపును సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవితంలో ఎదురయ్యే కష్టాల నుంచి ఎన్‌సీసీ బయటపడేసి ఉత్తమ జీవితానికి బాటలు వేస్తుందన్నారు. పాఠశాలలో వసతి బాగుందని ప్రశంసిస్తూ డైరెక్టర్ సీహెచ్ విజయ్‌ప్రకాష్‌ను సత్కరించారు. అనంతరం ఆంధ్ర, తెలంగాణకు సంబంధించి ఐడీఎస్ఎస్‌సీ టీం టీషర్ట్స్‌ను ఆవిష్కరించారు. రైఫిల్ షూటింగ్‌లో ఎంపికైన విద్యార్థులకు కిట్స్ అందజేశారు. కాకినాడ గ్రూప్ కమాండర్ కల్నల్ రితిన్‌మోహన్ అగర్వాల్, కల్నల్ హెచ్ఎస్ మౌనిక, మేనేజర్ మహమ్మద్ ఆసిఫ్, ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

'గోదావరి' తగ్గుముఖం

ధవళేశ్వరం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): రెండురోజులుగా తగ్గుముఖం పడుతున్న గోదావరి వరద ప్రవాహం గురువారం మరింత తగ్గింది. సాయంత్రానికి ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ నుంచి 4,52,898 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. వ్యవసాయ అవసరాల కోసం తూర్పు డెల్టాకు 4,800 క్యూసెక్కులు, మధ్య డెల్టాకు 2600 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 7000 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నారు. ఎగువన భద్రాచలం వద్ద తగ్గుముఖం పడుతున్న నీటిమట్టం గురువారం సాయంత్రానికి 29.20 అడుగులుగా నమోదయింది.

కొవ్వూరులో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్ ఇవ్వాలి : ఎంపీ

కొవ్వూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరులో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్‌ను పునరుద్ధరించాలని రైల్వే బోర్డు చైర్మన్‌కు బీజేపీ నేత, రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు ఢిల్లీలోని రైల్వేభవన్‌లో చైర్మన్ సతీష్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అలాగే రానున్న గోదావరి పుష్కరాల నేపథ్యంలో రాజమహేంద్రవరం, గోదావరి, కొవ్వూరు, నిడదవోలు, అనపర్తి రైల్వేస్టేషన్లలో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని కోరారు.

ఆధ్యాత్మిక యాత్రకు .. ఇండియన్ రైల్వే శ్రీకారం

- సెప్టెంబర్ 9న మహాలయ పక్ష ప్రత్యేక సప్త మోక్ష యాత్ర ప్రారంభం

కాకినాడ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పవిత్ర పుణ్య క్షేత్ర దర్శనాలే లక్ష్యంగా ఆధ్యాత్మిక యాత్రకు శ్రీకారం చుట్టామని ఇండియన్ రైల్వేస్ సౌత్ స్టార్ రైల్ అండ్ టూర్ టైమ్స్ డైరెక్టర్ విఘ్నేష్ జీ తెలిపారు. గురువారం కాకినాడ ప్రెస్ క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మహాలయ పక్ష ప్రత్యేక సప్త మోక్ష యాత్ర పేరుతో ఈ యాత్ర సెప్టెంబర్ 9న ప్రారంభమవుతుందన్నారు. ఇందులో గూడూరు, నెల్లూరు, ఒంగోలు, చీరాల, గుంటూరు, మిర్యాలగూడ, నల్గొండ, హైదరాబాద్, కాజీపేటస్టేషన్లో యాత్రికులు రైలు ఎక్కే వీలుందన్నారు. 15 రోజులపాటు జరిగే ఈ యాత్రకు ఇండియన్ రైల్వేస్, భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలు, సౌత్ స్టార్ రైలు, భారత ప్రభుత్వ పర్యాటక మంత్రిత్వశాఖ గుర్తింపు పొందిన టూరిస్ట్ రైలు ఆపరేటర్ 'టూర్‌టైమ్స్ నడుంబిగించిందన్నారు. ఈయాత్రలో ఉజ్జయిని, ఓంకారేశ్వర్, ద్వారకా, సిద్ధపూర్, మధుర, అయోధ్య, ప్రయాగ్‌రాజ్, వారణాసి, గయ కవర్ చేస్తామన్నారు. టూర్ టైమ్స్ జనరల్ మేనేజర్ సంతోష్ మాట్లాడుతూ యాత్రికులకు దక్షిణ భారత భోజనం, ఇతరత్రా సదుపాయాలు ట్రైన్ లోపల కల్పిస్తున్నామన్నారు. ఈ ప్యాకేజీపై ఇండియన్ రైల్వే 33 శాతం సబ్సిడీ ఇస్తుందన్నారు. ఇతర వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.టూర్‌టైమ్స్.ఇన్ వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చన్నారు.



కమ్మేసిన కారు మబ్బులు

గురువారం సాయంత్రం రాజమహేంద్రవరంలోని పుష్కరాల రేవులో కారుమబ్బులు కమ్మేశాయి. శివుడు, పుష్కరాల రేవులో ఉన్న ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఏర్పడిన చూడముచ్చటైన దృశ్యాలు

–స్టాఫ్ ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం



హాకీ పోటీలకు సర్వం సిద్ధం

- క్రీడాకారుల రాకతో సందడిగా మారిన మైదానం
- నేటి నుంచి జాతీయ జూనియర్స్ హాకీ టోర్నమెంట్
- దేశవ్యాప్తంగా 28 రాష్ట్రాల నుంచి క్రీడాకారుల రాక
- 600 మంది క్రీడాకారులు, కోచ్‌లు
- ఏర్పాట్లను పరిశీలించిన అధికార యంత్రాంగం

కార్పొరేషన్(కాకినాడ), జూలై 31 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో శుక్రవారం నుంచి జరుగనున్న 15వ జాతీయ మహిళా జూనియర్ హాకీ ఛాంపియన్‌షిప్‌కు సంబంధించి ఏర్పాట్లను జిల్లా అధికార మంత్రాంగం సర్వంసిద్ధం చేసింది. రెండు మూడు రోజుల ముందు నుంచే క్రీడాకారులు ఆయా రాష్ట్రాల నుంచి క్రీడామైదానానికి చేరుకోవడంతో క్రీడా మైదానం సందడిగా మారింది. దేశవ్యాప్తంగా 28 రాష్ట్రాల నుంచి సుమారు 600 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారు. 50మంది పీడీలు ఈ క్రీడలను పర్యవేక్షించనున్నారు. జిల్లా కలెక్టర్ షాన్మోహన్ ఆధ్వర్యంలో జిల్లా మంత్రాంగం గత పదిరోజులుగా వచ్చిన క్రీడాకారుల వసతి వంటి ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ సర్వం సిద్ధం చేశారు. వచ్చిన క్రీడాకారులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు తగిన చర్యలు చేపట్టారు. గురువారం ఫ్రీడమ్ మైదానంలో క్రీడాకారులు సందడిగా కనిపించారు. కొంతమంది క్రీడాకారులు గుంపులు గుంపులుగా సేద తీరుతున్నారు. మరికొందరు వారు క్రీడా పరికరాలను సిద్ధం చేసుకుంటున్నారు. ఇంకొంతమంది హాకీ మైదానంలో ప్రాక్టీస్ చేస్తూ కనిపించారు. మరి కొంతమంది కాకినాడ బీచ్‌కు వెళ్లి సందర్శించారు. 12వ తేదీ వరకు జరుగనున్న ఈ పోటీలు ముగిసేవరకు క్రీడా మైదానంతో పాటు క్రీడాకారులతో కాకినాడ నగరం సందడిగా మారనుంది.



హాకీ పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన క్రీడాకారిణులు

వసతి సౌకర్యం..

సామర్లకోటలో ఎక్స్టెన్షన్ ట్రైనింగ్ సెంటర్ (ఈటీసీ), సర్వే ట్రైనింగ్ అకాడమీ (ఎస్‌టీఏ), టీటీడీసీ క్యాంపస్, కాకినాడలో జేఎన్టీయూ ఉమెన్స్ హాస్టల్, బాలాచెరువు సెంటర్ జీఎంసీ బాలయోగి అంబేడ్కర్ హాస్టల్, గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజ్ హాస్టల్, శ్యామ్ ఇన్‌స్టిట్యూట్, అచ్చంపేట ఆదికవి నన్నయ యూనివర్సిటీ క్యాంపస్ ప్రాంతాల్లో క్రీడాకారులకు వసతి సౌకర్యం కల్పించారు.

ప్రతిభ చాటిన క్రీడాకారులకు శిక్షణ ఇస్తాం

- హాకీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు నిరంజన్ రెడ్డి

కార్పొరేషన్ (కాకినాడ), జూలై 31 (ఆంధ్రజ్యోతి):కాకినాడ జిల్లా క్రీడామైదానంలోని హాకీ ఫీల్డ్‌వద్ద హాకీ ఆంధ్రప్రదేశ్ కార్యవర్గ సభ్యులు శుక్రవారం నుంచి జరిగే 15వ జాతీయ మహిళా జూనియర్ హాకీ ఛాంపియన్‌షిప్‌కు సంబంధించి గురువారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హాకీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు ఎం.నిరంజన్‌రెడ్డి, కార్యదర్శి బి.చాణుక్యరాజు, జి.హర్షవర్ధన్ మాట్లాడుతూ ఈ ఛాంపియన్‌షిప్‌లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఎంపికచేసి ఢిల్లీలో శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణా కాలంలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఇండియా హాకీ టీంకు ఎంపిక చేస్తామన్నారు. దేశవ్యాప్తంగా 28 రాష్ట్రాల నుంచి 600 మంది క్రీడాకారులు, కోచ్‌లు ఈ పోటీలో పాల్గొంటారని తెలిపారు. స్థానికంగా 50 మంది పీడీలు పర్యవేక్షణ చేస్తారన్నారు. 2026-27లో జరిగే జూనియర్ ఉమెన్స్ ఇండియా హాకీ జట్టును తయారు చేసి పోటీలకు పంపేందుకు సిద్ధం చేస్తున్నామన్నా రు. కాకినాడలో 12వ తేదీన హాకీ జూనియర్ ఉమెన్స్ నేషనల్ ఛాంపియన్‌షిప్ 2025 పోటీలను దిగ్విజయంగా నిర్వహించి స్పోర్ట్స్ అథారి టీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, జిల్లా కలెక్టర్ షాన్మోహన్ మాకు అన్నిరకాలుగా పూర్తి సహాయసహకారాలు అందిస్తున్నారన్నారు. వీరితో పాటు స్థానికంగా ఉన్న డీఎస్‌డీవో శ్రీనివాసకుమార్, హాకీ సీనియర్ కోచ్ వి.రవిరాజు, ఇతర కార్యవర్గ సభ్యులు సహాయసహకారాలు అందించి సమిష్టిగా పనిచేసి టోర్నమెంట్‌ను విజయవంతం చేసి హాకీ ఆంధ్రప్రదేశ్‌కు పేరుప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న హాకీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు నిరంజన్ రెడ్డి

మతిస్థిమితం లేని వ్యక్తి జగన్

- ఆయన పర్యటనలను పట్టించుకోవాల్సిన అవసరం లేదు
- రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్
- రాజమహేంద్రవరం ఈఎస్ఐ ఆసుపత్రిలో అంబులెన్స్ సర్వీసులు ప్రారంభం
- ఈఎస్ఐ ఆసుపత్రి నూతన భవనాన్ని సెప్టెంబరులో ప్రారంభిస్తామని వెల్లడి



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

రాజమహేంద్రవరంఅర్బన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి మతిస్థిమితం లేని వ్యక్తి అని, ఆయన పర్యటనలను పట్టించుకోవాల్సిన అవసరం లేదని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆరోపించారు. రాజమహేంద్రవరంలో నిర్మాణంలో ఉన్న ఈఎస్ఐ నూతన భవనాన్ని ఈ ఏడాది సెప్టెంబరులో ప్రారంభిస్తామని వెల్లడించారు. గురువారం సాయంత్రం రాజమహేంద్రవరంలోని ఈఎస్ఐ ఆసుపత్రిలో సీఎస్ఆర్ నిధులతో యూనియన్ బ్యాంకు సమకూర్చిన అత్యాధునిక సౌకర్యాలతో కూడిన అంబులెన్స్ సర్వీసులను ఆయన ప్రారంభించారు. మంత్రి సుభాష్ మీడియాతో మాట్లాడుతూ కార్మికుల ఆరోగ్యం, సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని అన్నారు. అన్నవరం, తిరుపతి ఈఎస్ఐ ఆసుపత్రుల్లో సౌకర్యాలు మెరుగుపరుస్తామని, కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. రాజమహేంద్రవరం ఈఎస్ఐ ఆసుపత్రికి రోజూ 200 నుంచి 300 మంది రోగులు వైద్యం కోసం వస్తున్నారని, కార్మికులకు బీమా చెల్లింపులో యాజమాన్యాల నిర్లక్ష్యం ఉంటే శాఖాపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి అన్నారు. త్వరలో అమరావతిలో 150 పడకలతో సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రిని నిర్మించనున్నామన్నారు. ఫ్యాక్టరీలు, ఇతర కర్మాగారాల్లో జీరో ఇన్సిడెంట్స్ లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటించని ఫ్యాక్టరీలకు అనుమతులు మంజూరు చేయబోమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీమా మెడికల్ సర్వీసెస్ డైరెక్టర్ వి.ఆంజనేయులు, యూనియన్ బ్యాంకు రీజనల్ మేనేజర్ ఏ.విశ్వేశ్వరరావు, ఈఎస్ఐ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ స్టేట్ ఛాంపియన్‌గా

రాజమండ్రి కుర్రోడు మోహిత్ ఎంపిక



ఛాంపియన్‌షిప్ ట్రోఫీని అందుకుంటున్న మోహిత్

రాజమహేంద్రవరం, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ స్టేట్‌చాంపియన్ 2025 టైటిల్‌ను రాజమహేంద్రవరం కుర్రాడు సాధించాడు. దీంతో చారిత్రక రాజమహేంద్రవరానికి క్రీడా పరంగా కూడా మళ్లీ పేరు వచ్చింది. రాజమహేంద్రవరానికి చెందిన కొత్తపల్లి బాలు కుమారుడు కొత్తపల్లి మోహిత్ (18) ఈ టైటిల్ ను సాధించారు. ఈనెల 28నుంచి 31వరకూ తిరుపతిలో చిత్తూరుజిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ సీనియర్ బాడ్మింటన్ చాంపియన్‌షిప్-2025 పోటీలను మెన్ అండ్ విమెన్ విభాగాలలో నిర్వహించారు. గురువారం ఫైనల్ పోటీలలో మెన్ విభాగంలో కొత్తపల్లి మోహిత్ విజేతగా నిలిచాడు. రాజమహేంద్రవరానికి చెందిన మోహిత్ సుమారు 10ఏళ్ల నుంచి ప్రాక్టీస్ చేస్తున్నారు. 18ఏళ్ల వయస్సుగల ఈ యువకుడు విజయవాడలో బిబిఏ చదువుతున్నారు. ప్రతిష్టాత్మకమైన బ్యాడ్మింటన్ పోటీలలో స్టేట్ చాంపియన్‌గా ఈప్రాంత యువకుడు నిలవడంతో అందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రమంత్రి కందుల దుర్గేష్, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఆదిరెడ్డివాసు, ఎమ్మెల్సీ సోమువీర్రాజు, అనుశ్రీ అధినేత సత్యనారాయణ తదితరులు ఈ యువకుడిని అభినందించారు.యువకుడి తండ్రి బాలు మాట్లాడుతూ తన కుమారుడు ఛాంపియన్‌గా నిలవడం చాలా ఆనందంగా ఉందని, త్వరలో ఏడు రాష్ట్రాల పరిధిలో జరిగే సౌత్‌జోన్ పోటీలకు హాజరుకానున్నాడని, నవంబరు లేదా డిసెంబర్‌లో జరిగే నేషనల్ ఛాంపియన్‌షిప్ పోటీలకుస్టేట్‌చాంపియన్‌గా పాల్గొంటాడన్నారు.

ముగిసిన టేబుల్ టెన్నిస్ పోటీలు

- జాతీయస్థాయి పోటీలకు 42 మంది విద్యార్థుల ఎంపిక



విద్యార్థులకు మెమెంటోలు అందజేస్తున్న దృశ్యం

ఎటపాక, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఎటపాక జవహర్ నవోదయ విద్యాలయంలో మూడురోజులుగా నిర్వహిస్తున్న రీజనల్ స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు గురువారంతో ముగిశాయి. ఈ పోటీల్లో పాల్గొన్న 96 మంది విద్యార్థుల్లో 42మంది విద్యార్థులు నేషనల్‌స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు ఎంపికైనట్లు నవోదయ విద్యాలయం వైస్ ప్రిన్సిపాల్ తెలిపారు. ఇందులో 21మంది బాలికలు, 21 మంది బాలురు ఎంపికైనట్లు చెప్పారు. అండర్-14 బాలికల నుంచి ఏడుగురు, అండర్-14 బాలుర నుంచి ఏడుగురు, అండర్-17 బాలికల నుంచి ఏడుగురు, అండర్-17 బాలుర నుంచి ఏడుగురు, అండర్- 19 బాలికల నుంచి ఏడుగురు, అండర్-19 బాలుర నుంచి ఏడుగురు విద్యార్థులు సెలక్ట్ అయ్యారు. వీరంతా ఈనెలలో అస్సాంలో జరు గనున్న నేషనల్‌స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీల్లో పాల్గొననున్నారు. అనంతరం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులందరికీ మెడల్స్‌తోపాటు సర్టిఫికెట్లను అందజేశారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందిన క్లస్టర్ల విద్యార్థులకు కూడా మెమొంటోలు అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి

తాళ్లరేవు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కాకినాడజిల్లా తాళ్లరేవు మండలం కోరింగ వద్ద 216 జాతీయ రహదారిపై గురువారం జరిగిన ప్రమాదంలో వృద్ధురాలు మృతి చెందింది. ఎస్ఐ పి.సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం... డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం పెదమడి గ్రామానికి చెందిన మందపాటి సుభద్రమ్మ (67), ఆమె భర్త సూర్యనారాయణరాజు కాకినాడ కారులో వెళ్లి తిరిగివస్తుండగా కోరింగ పోలీసుస్టేషన్ ప్రాంతంలో యానాం నుంచి కాకినాడ వెలుతున్న ఆర్టీసీ బస్సును అదు పుతప్పి ఢీకొట్టింది. దీంతో సుబద్రమ్మ అక్కడికక్కడే మరణించింది. సూర్యనారాయణరాజుకు గాయాలు కాగా కాకినాడ ఆసుపత్రికి తరలించారు. సుబద్రమ్మ మృతదేహాన్ని అంబులెన్స్‌లో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి మార్చురీకి పోలీసులు తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.



సంఘటనాస్థలంలో మృతిచెందిన సుభద్రమ్మ

బాలికపై అత్యాచారం

- పోక్సో చట్టం కింద కేసు నమోదు

అల్లవరం, జూలై 31(ఆంధ్రజ్యోతి): ప్రేమించుకుందాం.. పెళ్లి చేసుకుంటానని నమ్మించి 16 ఏళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడ్డ యువకుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. అల్లవరం మండలం ఒక గ్రామంలో ఒక బాలికను నమ్మించి అయినవిల్లి మండలం మాగాం గ్రామానికి చెందిన నవుంద్రు రాకేష్ అనే యువకుడు అత్యాచారానికి పాల్పడ్డాడని బుధవారం బాలిక తల్లిదండ్రులు అల్లవరం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాలికను అత్యాచారం చేసిన అభియోగంపై నవుంద్రు రాకేష్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశామని అల్లవరం ఎస్ఐ బి.సంపత్‌కుమార్ విలేకరులకు తెలిపారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

కొవ్వూరు, జూలై 31(ఆంధ్రజ్యోతి): అనారోగ్యానికి గురై మనస్తాపం చెంది ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుని వ్యక్తి మృతి చెందినట్లు కొవ్వూరు పట్టణ హెడ్ కానిస్టేబుల్ ఆర్.సత్యనారాయణ తెలిపారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం పట్టణంలోని క్రిస్టియన్‌పేటకు చెందిన చిగురుపాటి శ్రీనివాస్ (56) టీవీ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. భార్య ప్రియదర్శిని, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో అప్పులుచేసి వైద్యం చేయించుకున్నాడు. అనారోగ్యం కుదుటపడకపోవడంతో మనస్తాపం చెంది జూలై 30వ తేదీన రాత్రి ఇంట్లో చీరతో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం లేచి చూసేసరికి ఫ్యాన్‌కు వేలాడుతున్న భర్తనుచూసి భార్య ప్రియదర్శిని పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ సత్యనారాయణ తెలిపారు.

జాతీయస్థాయి వర్క్‌షాపులో

తొండవరం విద్యార్థికి ఉత్తమ ప్రదర్శన అవార్డు

- ఉత్తమ ప్రదర్శనగా ఎంపికైన ప్రాజెక్టు

అంబాజీపేట, జూలై 31(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి విజ్ఞాన శాస్త్ర ప్రాజెక్టు ప్రజెంటేషన్, వర్క్‌షాపు 2025ను పురస్కరించుకుని నాలుగు రోజులపాటు న్యూఢిల్లీ, గలగోటియ యూనివర్శిటీ నోయిడ, ఉత్తరప్రదేశ్‌లలో నిర్వహించిన కార్యక్రమంలో అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం తొండవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థి సోము ఈశ్వరశ్రీ రామ్‌తేజ, ఉపాధ్యాయుడు కందాల గణేష్ నరసింహం పాల్గొన్నారు. మిని స్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ ఇన్నోవేటివ్ సెల్, ఏఐసీటీయూ ద్వారా జాతీయస్థాయికి ఎంపికైన 39ప్రాజెక్టులను గలగోటి యూనివర్శిటీ నోయిడ, ఉత్తరప్రదేశ్‌లో వర్క్‌షాపు ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కేంద్ర విద్యాశాఖా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, ఏఐసీటీఈ అసిస్టెంట్ డైరెక్టర్లు పాల్గొన్నారు. 2024 విద్యాసంవత్సరానికి ఆంధ్రప్రదేశ్ నుంచి ఎంపికై ప్రదర్శించబడిన తొండవరం హైస్కూల్‌కు చెందిన కార్బన్‌డైయాక్సైడ్ ఫిల్టర్ ప్రాజె క్టు సస్టైనబుల్ డవలప్‌మెంట్ విభాగం నుంచి జాతీయ ఉత్తమ ప్రదర్శనగా ఎంపికైంది. ఈ కార్బన్‌డైయాక్సైడ్ ఫిల్టర్ ప్రాజెక్టు పేటెంట్ పొందడంలో మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ తమవంతు సహకారం అందజేస్తామని తెలిపారు. అదేవిధంగా జూలై 29న న్యూఢిల్లీలో కేంద్ర విద్యాశాఖా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ముఖ్యఅతిథిగా పాల్గొన్న నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ డే సదస్సుకు మా ప్రాజెక్టు ప్రతినిధుల ద్వారా ఆహ్వానం అందడంతో పాల్గొన్నామని ఉపాధ్యాయుడు నరసింహం తెలిపారు. ఈ జాతీయస్థాయిలో పోటీలలో పాల్గొని విజయం సాధించిన విద్యార్థులకు ప్రత్యేక ఇన్నోవేషన్ కోటాలో ప్రాధాన్యం ఇస్తామని ఏఐసీ టీఈ అసిస్టెంట్ డైరెక్టర్ తెలిపారు. దీంతో ఉపాధ్యాయుడు నరసింహంతోపాటు విద్యార్థి శ్రీరామ్‌తేజను హెచ్‌ఎం కేశవాచార్యులతోపాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.



అవార్డు అందుకుంటున్న విద్యార్థి, ఉపాధ్యాయుడు

దారి దోపిడీ ఘటనపై

సాగుతున్న విచారణ

- సీసీ కెమెరాల పుటేజీ, సెల్ టవర్ల డేటా సేకరణ
- అనుమానితులను ప్రశ్నిస్తున్న పోలీసులు

గొల్లప్రోలు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కాకినాడజిల్లా గొల్లప్రోలు పట్టణ శివారు చెందుర్తి రోడ్డులో జరిగిన భారీ దారి దోపిడీ ఘటనలో పోలీసుల విచారణ కొనసాగుతోంది. వారు సీసీ పుటేజీలు, సెల్ టవర్ల డేటాను సేకరించి విశ్లేషిస్తున్నారు. పలువురు అనుమానితులను అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. కాకినాడ ఎస్‌డీపీవో మనీష్‌దేవరాజ్ పాటిల్ ఆధ్వర్యంలో ఐదు దర్యాప్తు బృందాలు వివిధ కోణాల్లో విచారణ సాగిస్తున్నాయి. సమీర్ ప్రజాపత్ ప్రయాణించినట్టు చెబుతున్న మార్గంలోని సీసీ కెమెరాలను పరిశీలించడంతో అతను చెప్పిన సమయాల్లోని డేటాను సేకరించారు. అతను తిరిగి మార్గంలోని సెల్‌టవర్ల పరిధిలో కాల్‌డేటాలను విశ్లేషిస్తున్నారు. దారి దోపిడీకి పాల్పడిన నలుగురు ఆగంతకులు ఎవరు, వీరు పాత నేరస్తులు, లేకుంటే సమీర్‌కు పరిచయం ఉన్న వారా తదితర అంశాలను పరిశీలించారు. ఇటీవల చోరీలకు పాల్పడిన వారిని పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. అయితే సమీ ర్ చెబుతున్న విషయాలకు, సీసీ కెమెరాల్లో లభించిన డేటా మధ్య పొంతన కుదరట్లేదని తెలిసింది. విచారణలో పిఠాపురం శ్రీనివాస్, గొల్లప్రోలు ఎస్ఐ రామకృష్ణ, సర్కిల్ పరిధిలోని ఎస్ఐలు పాల్గొన్నారు.



సీసీ పుటేజీల డేటాను పరిశీలిస్తున్న గొల్లప్రోలు ఎస్ఐ రామకృష్ణ తదితరులు

రక్షణ కల్పించండి సారూ!

- ఎస్పీని ఆశ్రయించిన ప్రేమ జంట



ఎస్పీని కలిసి బయటకు వస్తున్న ప్రేమ జంట

కాకినాడక్రైం, జూలై 31(ఆంధ్రజ్యోతి): ప్రేమించి పెళ్లి చేసుకున్న తమకు తమ కుటుంబీకుల నుంచి ప్రాణహాని ఉందని ఓ ప్రేమజంట గురువారం ఎస్పీ జి.బిందుమాధవ్‌ను ఆశ్రయించి ంది. ప్రేమ జంట తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కాకినాడజిల్లా కాకినాడరూరల్ మండలం సర్పవరం గ్రామానికి చెందిన యాళ్ళ రమ్య, సామర్లకోట మండలం నవర గ్రామానికి చెందిన వాకపల్లి సాయిగణేష్ రెండేళ్లుగా ప్రేమించుకున్నారు. అయితే ఇరువురి పెద్దలకు ప్రేమ విషయం తెలిసిన వారి పెళ్లికి ఒప్పుకోలేదు. ఈ నేపథ్యంలో మేజర్‌లైన ఇద్దరూ అన్నవరం వెళ్లి సత్యనారాయణస్వామి సన్నిధిలో ఇటీవల ప్రేమ వివాహం చేసుకున్నారు. సాయి గణేష్‌పై రమ్య కుటుంబీకులు సర్పవరం పోలీస్‌స్టేషన్‌లో కిడ్నాప్ కేసు పెట్టారు. తనను సాయి గణేష్ బలవంతంగా తీసుకెళ్లలేదని, ఇద్దరం ఇష్టపూర్వకంగానే పెళ్లి చేసుకున్నామని రమ్య మీడియాకు వివరించింది. తన తల్లి, అన్నయ్య తమను చంపేందుకు ప్రణాళిక రచిస్తున్నారని, రౌడీలను పెట్టి తమ కోసం గాలిస్తున్నారని రమ్య వాపోయింది. ప్రాణాపాయం ఉండి గత్యంతరం లేని పరిస్థితుల్లో తమ ప్రాణరక్షణ కోసం ఎస్పీని ఆశ్రయించాల్సి వచ్చిందని రమ్య తెలిపింది. తమ పరిస్థితిని అర్థం చేసుకున్న ఎస్పీ సర్పవరం సీఐతో చెప్పి ఎటువంటి ఇబ్బంది కలుగకుండా చూస్తానని ఎస్పీ హామీ ఇచ్చారని ఆ ప్రేమ జంట మీడియాకు తెలిపింది.

వానపల్లిలో క్షుద్రపూజల కలకలం

- ఆరుగురిపై బైండోవర్ కేసు

కొత్తపేట, జూలై 31(ఆంధ్రజ్యోతి): కొత్తపేట మండలం వానపల్లి గాంధీబొమ్మ సెంటర్ సమీపంలో ఒకఇంట్లో రహస్యంగా క్షుద్రపూజలు చేస్తున్నారన్న ఆరోపణలు కలకలంరేపింది. దీనికి సంబంధించి ఒక ఇంటి పెరటిలో 30అడుగుల లోతులో గొయ్యి తవ్వించి ప్రాంతం నుంచి ఆ ఇంటి యజమాని నలుగురు వ్యక్తులను తీసుకువచ్చి పూజలు చేయిస్తున్నాడని దీంతో గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారని పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఎస్ఐ జి.సురేంద్ర తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఆ ఇంటి యజమానిని ఆరా తీయగా తమ ఇంట్లో వివాహాలు జరగడంలేదని దీంతో వాస్తుదోషం ఉన్నట్లు గుర్తించి ఇంటి పెరటిలో ఓ మూలన బావి తవ్విస్తున్నామని తెలిపారు. అయితే బావి తవ్వడానికి బయట ప్రాంతం నుంచి వ్యక్తులను ఎందుకు తీసుకువచ్చారని వారి వివరాలు సేకరించి సంబంధిత ఆరుగురుపై బండోవర్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సురేంద్ర తెలిపారు.



వానపల్లిలో క్షుద్రపూజలకు సిద్ధం చేశారంటున్న 30 అడుగుల గొయ్యి

తప్పిపోయిన బాలుడు తల్లిదండ్రులకు అప్పగింత

సామర్లకోట, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట రైల్వేస్టేషన్‌లో తప్పిపోయిన నాలుగేళ్ల బాలుడిని సామర్లకోట ట్రాఫిక్ పోలీసులు గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరానికి చెందిన కూలీ బొజ్జా ఆంజనేయులు కుటుంబం సామర్లకోట రైలు దిగి విశాఖజిల్లా దువ్వాడ వెళ్లేందుకు మరో రైలు కోసం స్టేషన్‌లో ఎదురుచూస్తోంది. ఈ తరుణంలో కుమారుడు రాము కనిపిం చకపోవడంతో స్టేషన్ పరిసర ప్రాంతాల్లో వెదికారు. అయినా ఆచూకీ తెలియకపోవడంతో స్టేషన్ ఎదురుగానే ఉన్న ట్రాఫిక్ ఎస్ఐ అడపా గరగారావుకు తెలిపారు. దీంతో ఆయన ట్రాఫిక్ పోలీసులను నలువైపులా గాలించమని ఆదేశించి సీసీ కెమెరా ల్లో ఫుటేజీలను పరిశీలించారు. జయలక్ష్మి థియేటర్ రోడ్డులో బజ్జీల బండివద్ద బాలుడు రాము ఉన్నట్లు గుర్తించి అతడిని చేరదీసి తల్లిదండ్రులకు క్షేమంగా అప్పగించారు. ట్రాఫిక్ ఎస్ఐ గరగారావుతోపాటు సిబ్బందికి రాము కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



తప్పిపోయిన బాలుడిని అప్పగించిన ట్రాఫిక్ ఎస్ఐ

గొర్రిపూడిలో తాటాకిల్లు దగ్ధం

- రూ.1.20 లక్షల ఆస్తి నష్టం

కరప, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరప మండలం గొర్రిపూడిలో బుధవారం అర్ధరాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో ఓ తాటాకిల్లు దగ్ధమై రూ.1.20 లక్షల ఆస్తి నష్టం సంభవించింది. గొర్రిపూడి శివారు మురుకోపోర ప్రాంతానికి చెందిన గండి అప్పలరాజు కుటుంబీకులతో కలిసి తాటాకింట్లో నివాసం ఉంటున్నాడు. వ్యవసాయ కూలీ అయిన అతడు కిడ్నీ వ్యాధికి డయాలసిస్ చేయించుకుంటున్నాడు. బుధవారం అర్ధరాత్రి విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో తాటాకిల్లు కాలిబూడిదైంది. ఇంట్లో ఉన్న రూ.50 వేలు నగదు, 8 క్వింటాళ్ల బియ్యం, 11కోళ్లు, రూ.20వేల విలువైన వస్తువులు, ఫర్నీచర్ అగ్నికి ఆహుతయ్యాయి. వీఆర్వో గోపాలరావు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు నమోదు చేసుకుని తహసీల్దారుకు నివేదిక అందించారు. బాధిత కుటుంబ సభ్యులను నీటిసంఘం అధ్యక్షుడు జోకా తాతాజీ, జనసేన నాయకులు రాంబాబు, అన్నవరం పరామర్శించి ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని చెప్పారు.

పిడియాట్రిక్స్ ప్రొఫెసర్

వీఆర్ఎస్‌కు ఆమోదం

జీజీహెచ్ (కాకినాడ), జూలై 31 (ఆంధ్రజ్యోతి) కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో పిడియాట్రిక్స్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ డి.లక్ష్మీవిద్య స్వచ్ఛంద ఉద్యోగ విరమణకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ మేరకు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ జీవో ఎంఎస్ నెం.86 జారీ చేసింది. వీఆర్ఎస్ జూలై 31 నుంచి అమల్లోకి వస్తుందని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



భవన నిర్మాణానికి స్థల పరిశీలన చేస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప

'ప్రతి కుటుంబం బంగారు కుటుంబం కావాలి'

పెద్దాపురం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ప్రతి కుటుంబం బంగారు కుటుంబం కావాలని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ఆకాంక్షించారు. గురువారం ఆయన పట్టణంలో పర్యటించారు. సంత మార్కెట్‌లో నిర్మిస్తున్న చేపల వ్యాపారుల షెడ్‌ను, కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను సందర్శించారు. ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పీ4లో అర్హుల వివరాలు సేకరించి సర్వే అనంతరం ఫైనల్ చేయాలన్నారు. వ్యాపారవేత్తలు, ఉన్నత ఉద్యోగస్తులు, సమాజంలో ఆర్థికంగా ఉన్నత స్థానాల్లో ఉన్నవారిని గుర్తించి వారికి దత్తత ఇవ్వడానికి తగిన మార్గదర్శకాలు, సూచనలు ఇచ్చారు. ప్రభుత్వ భవనాల నిర్మాణానికి స్థలాలను ఎమ్మెల్యే పరిశీలించారు. ఆయన వెంట ఆర్డీవో కె.శ్రీరమణి, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరింటెండెంట్ ఉమామహేశ్వరి ఉన్నారు.

ఇ-ఆటోల మరమ్మతులకు ఐదు లక్షలా!

» కొత్త వాటికి రిపేర్లు ఏమిటి » గొల్లప్రోలు నగర పంచాయతీ సమావేశంలో నిలదీసిన కౌన్సిలర్లు

గొల్లప్రోలు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఒక్కసారీ వినియోగించని ఇ-ఆటోల మరమ్మతులకు రూ.5లక్షలు కేటాయించాలని ప్రతిపాదించడం ఏమిటని కౌన్సిలర్లు ప్రశ్నించారు. ఇవన్నీ కొత్త ఆటోలని, వాటి మరమ్మతులను విక్రయించిన సంస్థే చూసుకోవాలి కదా అని నిలదీశారు. నగర పంచాయతీ నిధులను ఇలా వృథా చేయడం తగదని వారన్నారు. గొల్లప్రోలు నగర పంచాయతీ కార్యాలయంలో చైర్‌పర్సన్ గండ్రేటి మంగతాయారు అధ్యక్షతన గురువారం సాయంత్రం జరిగిన కౌన్సిల్ సాధారణ సమావేశంలో సభ్యులు ఈ అంశాన్ని లేవనెత్తారు. రాష్ట్రవ్యాప్తంగా ఇ-ఆటోలను సరఫరా చేసిన సంస్థ రిపేర్లు చేయకపోవడంతో సాధారణ నిధుల నుంచి పనులు చేయించాలని సూచనలు వచ్చాయని కమిషనరు కనకారావు తెలిపారు. గొల్లప్రోలు పట్టణాభివృద్ధికి డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ద్వారా మంజూరైన కోటి రూపాయల్లో ఎస్సీ, ఎస్టీ వార్డులకు ఒక్క రూపాయి కూడా కేటాయించకపోవడం ఏమిటని కౌన్సిలర్లు బెందుకుర్తి సత్తిబాబు, గంటా అప్పలస్వామి, ఈరుగుల ఏసు, సింగం నాగేశ్వరరావు ప్రశ్నించారు. తమ వార్డులో లైట్లు వెలగట్లేదని కౌన్సిలరు జ్ఞానేశ్వరి, డ్రైన్ల పనులు సగం చేసి వదిలివేశారని మరో కౌన్సిలరు గుళ్ల సుబ్బారావు, పనుల వద్ద బోర్డులు ఏర్పాటు చేస్తామని చెప్పి ఇప్పటిదాకా చేయలేదని గంటా అప్పలస్వామి అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. సమావేశంలో వైస్ చైర్మన్ గంధం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



గొల్లప్రోలు కౌన్సిల్ సమావేశంలో సమస్యలపై అధికారులను ప్రశ్నిస్తున్న కౌన్సిలర్లు



జాయింట్ కలెక్టర్‌కు చెక్కు అందజేస్తున్న అసోసియేషన్ నేత రామకృష్ణ

కాకినాడ గోల్డ్ మర్చంట్స్ అసోసియేషన్ రూ.లక్ష విరాళం

కలెక్టరేట్ (కాకినాడ), జూలై 31 (ఆంధ్రజ్యోతి): కాకినాడలో ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ, మహిళల హాకీ టోర్నమెంట్ నిర్వహణకు కాకినాడ గోల్డ్ మర్చంట్స్ అసోసియేషన్ తరఫున రూ.లక్ష విరాళాన్ని అధ్యక్షుడు అనిశెట్టి రామకృష్ణ జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనాకు గురువారం అందజేశారు. కార్యక్రమంలో వాణిజ్య పన్నుల శాఖ సహాయ కమిషనరు జి.పద్మావతి, జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు, అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి ఎండీ బహదూర్, కార్యదర్శి ఎం.శ్రీనివాస్, పులవర్తి సీతారామ్మూర్తి, నెల్లిపూడి ఉదయ్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్లో ఆక్రమణలను నిరోధించలేరా!

పిఠాపురం మున్సిపల్ సమావేశంలో కౌన్సిలర్లు

పిఠాపురం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘ మార్కెట్‌లో ఆక్రమణలు పెరిగిపోయాయని, పార్కింగ్ ప్రదేశాలను ఆక్రమించి మరీ దుకాణాలు నిర్వహిస్తున్నారని కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. పిఠాపురం పురపాలక సంఘ కార్యాలయంలో గురువారం చైర్‌పర్సన్ గండేపల్లి సూర్యావతి అధ్యక్షతన మునిసిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. ఆక్రమణలను తొలగించాలని కౌన్సిలర్ తలిశెట్టి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. మున్సిపల్ మార్కెట్‌లో చేపల షెడ్డు నిర్మాణానికి గతంలో రూ.25లక్షలు వెచ్చించారని, మళ్లీ మౌలిక సదుపాయాలు కోసమంటూ రూ.21లక్షలు కేటాయించడం ఏమిటని టీడీపీ ఫ్లోర్ లీడర్ అల్లవరపు నగేష్ ప్రశ్నించారు. నిధులను సక్రమంగా వినియోగించాలని సూచించారు. వచ్చే సమావేశంలోగా మార్కెట్‌ను వినియోగంలోకి తెస్తామని తెలిపారు. చిన్నమాంబ పార్కు ఆవరణ, పరిసరాలు అధ్వానంగా ఉన్నాయని, లైట్లు వెలగట్లేదని, మందుబాబులు వీరంగం చేస్తుండడంతో పార్కుకు వచ్చేందుకు ప్రజలు ఇబ్బందిపడుతున్నారని కౌన్సిలర్లు నగేష్, కోళ్ల బంగారుబాబు, బోను దేవ చెప్పారు. ఐదు శాతం కంటే తక్కువకు టెండర్లు ఎలా ఆమోదిస్తున్నారని, దీనివల్ల కాంట్రాక్టర్లు పనుల్లో నాణ్యత ఎలా చూపగలుగుతారని కౌన్సిలర్లు సోమరౌతు లలిత, బోను దేవ ప్రశ్నించారు. డ్రైవర్స్ కాలనీలో కమ్యూనిటీ హాలు నిర్మాణానికి మున్సిపాలిటీ నిధులు ఇస్తే విరాళాలతో నిర్మించి బిల్లులు చేయించుకున్నారని కౌన్సిలర్ బోనాసుల శివ ఆరోపించారు. ఒకే వ్యక్తి పేరుపై రెండు, మూడు ఇంటి, కుళాయి పన్నులు ఉంటున్నాయని, డబుల్ ఎంట్రీల వలన ప్రభుత్వ పథకాలు పొందలేకపోతున్నారని కౌన్సిలర్లు తెలిపారు. 4వ వార్డు సచివాలయంలో సిబ్బంది కొరతను పరిష్కరించాలని దేవ, పెదపాటి నాగేశ్వరరావు కోరారు. వైస్ చైర్‌పర్సన్లు పచ్చిమళ్ల జ్యోతి, కొత్తపల్లి పద్మజ్యోతి, డీఈఈ రాజు పాల్గొన్నారు.



పిఠాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న కౌన్సిలర్లు

తరచూ ప్రొటోకాల్ ఉల్లంఘిస్తున్నారు

» కమిషనరు శ్రీవిద్య తీరుపై కౌన్సిలర్ల ధ్వజం » వాడివేడిగా సామర్లకోట మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

సామర్లకోట, జూలై 31 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట మున్సిపాల్టీలో ప్రొటోకాల్ నిబంధనలను తరచూ ఉల్లంఘిస్తూ కమిషనరు తప్పులపై తప్పులు చేస్తూ సభ్యులను కించపరుస్తున్నారు... ఇది మంచి పద్ధతి కాదు... పునరావృతమైతే కౌన్సిల్ తరపున ఫిర్యాదు చేస్తాం' అని పలువురు కౌన్సిలర్లు కమిషనరు శ్రీవిద్యపై ధ్వజమెత్తారు. సామర్లకోట మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం ఇన్‌చార్జి చైర్‌పర్సన్ గోకిన సునేత్రాదేవి అధ్యక్షతన గురువారం నిర్వహించారు. తొలుత అజెండాలోని 50 అంశాలను పక్కనబెట్టి జీరో అవర్ కావాలని పట్టుబట్టారు. ఇటీవలి కాలంలో కమిషనరు వ్యవహరించిన పలు అంశాలను సభ్యులు ఉటంకించారు. సీనియర్ కో-ఆప్షన్ సభ్యుడు మన్యం చంద్రరావు మాట్లాడుతూ ఇటీవల సామర్లకోట మున్సిపాల్టీకి చెందిన స్థలంలో నిర్మించిన భవనంలో తహసీల్దారు కార్యాలయం ఏర్పాటుచేసి ప్రారంభోత్సవ సమయంలో సభ్యులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా ఇద్దరు మంత్రుల సాక్షిగా అవమానించారని ఆరోపించారు. స్టేషన్ సెంటర్లో గడియార స్తంభం ప్రారంభ సమయంలో గతంలో శంకుస్థాపన చేసిన శిలాఫలకాన్ని ఎందుకు తొలగించారని ప్రశ్నించారు. పట్టణంలోని 15 సచివాలయాల్లో అధికారులు కౌన్సిలర్లకు ఏమాత్రం గౌరవం ఇవ్వట్లేదన్నారు. మొదటి ప్రొటోకాల్ కౌన్సిలర్లకే ఇస్తామని, మిగిలిన వారికి రెండో ప్రాధాన్యత ఇస్తామని కమిషనరు శ్రీవిద్య వివరణ ఇవ్వడాన్ని చంద్రరావు తప్పుగా పేర్కొన్నారు. తొలగించిన శిలాఫలకం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని కమిషనరు హామీ ఇచ్చారు. పట్టణంలోని అన్ని వార్డులోను చెత్త కుప్పలు పేరుకుపోయాయని, వీధి దీపాలు సక్రమంగా వెలగట్లేదని, కుళాయిల నుంచి బురదనీరు సరఫరా అవుతోందని వైస్ చైర్మన్ జాన్‌మోజెస్, కరణం రాజ్‌కుమార్, నేతల హరిబాబు, పిట్టా సత్యనారాయణ, జట్ల మోహన్ ఆరోపించారు. పారిశుధ్య సిబ్బందిని ఒక పని కోసం నియమించి వేర్వేరు పనులు అప్పగిస్తుండడం వలన పారిశుధ్యం మరింత క్షీణిస్తోందని రాజ్‌కుమార్, జాన్‌మోజెస్, సత్యనారాయణ, పాగా సురేష్‌కుమార్ అన్నారు. ఇకనుంచైనా కమిషనరు వార్డుల్లో పర్య టించి సమస్యలను పరిష్కరించాలని పలువురు సభ్యులు సూచించారు.

అనంతరం అజెండా లోని 50 అంశాలపై పెద్దగా చర్చ లేకుండానే హడావుడిగా ముగించేశారు. తొలుత ఇటీవల మృతిచెందిన సీనియర్ కౌన్సిలర్ పితాని కృష్ణ మృతికి సంతాపసూచకంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. కృష్ణ కుటుంబానికి కౌన్సిలర్లంతా ఒక నెల గౌరవ వేతనాన్ని అందజేసేందుకు తీర్మానించారు.



కమిషనరు తీరుపై ధ్వజమెత్తుతున్న కౌన్సిలర్ చంద్రరావు



మత్స్యకార మహిళకు బియ్యం అందజేస్తున్న జనసేన ఇన్‌చార్జి శ్రీనివాసరావు

బాధిత మత్స్యకారులకు బియ్యం పంపిణీ

కొత్తపల్లి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): సముద్రం ఉప్పొంగి కెరటాలు ఇళ్లల్లోకి రావడంతో మండలంలోని ఉప్పాడ శివారు మాయాపట్నం మత్స్యకారులు ఇబ్బందిపడు తున్నారు. కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశాల మేరకు 156 మంది బాధితులకు ఒక్కొక్కరికి 10 కిలోల బియ్యాన్ని జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు గురువారం పంపిణీ చేశారు. పగలు వేటాడే మత్స్యకారులకు జిల్లా మత్స్య శాఖ ఉచితంగా మంజూరు చేసిన జీపీఎస్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఉమ్మిడి మేరీజాన్, పీబీసీ డీసీ-1 చైర్మన్ మురాలశెట్టి సునీల్ కుమార్, జనసేన వైద్య విభాగం ప్రతినిధి, సురక్ష మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ అధినేత డాక్టర్ జ్యోతుల శ్రీనివాస్, పాడా ప్రాజెక్టు డైరెక్టర్ సత్యనారాయణ, కొత్తపల్లి తహసీల్దారు జి.చిన్నారావు, మత్సా అప్పాజీ, గంటా విజయకుమార్ (జీవీకే) తదితరులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తపై విస్తృత అవగాహన కల్పించాలి: డీపీవో

పెదపూడి (కరప), జూలై 31 (ఆంధ్రజ్యోతి): తడి, పొడి చెత్తపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్ కోరారు. గురువారం ఆయన పెదపూడి మండలం ఏపీ త్రయంలో ఆకస్మికంగా పర్యటించారు. శానిటేషన్ వర్కర్ల ఆధ్వర్యంలో తడి, పొడి చెత్తపై నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాన్ని పరిశీ లించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీ4లో భాగంగా బంగారు కుటుంబాల దత్తతలో అవకాశం ఉన్నవారు భాగస్వాములు కావాలని కోరారు. గ్రామానికి ట్రాక్టర్ ఇచ్చారని, ట్రక్ ఇస్తే మరింత ఉపయోగకరంగా ఉంటుందని సర్పంచ్ కోరారు. తాను రెండు నిరుపేద కుటుంబాలను దత్తత తీసుకుంటానని ఆయన హామీ ఇచ్చారు. ఓవర్ హెడ్ ట్యాంకు డీపీవో పరిశీలించారు. వాటర్ క్లోరినేషన్ టెస్టింగ్ నిర్వహించి పరీక్షించిన అనంతరం సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంపీడీవో మేడపాటి సత్యనారాయణ రెడ్డి, గ్రామ కార్యదర్శి తరుణ్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు శిక్షణ

సర్పవరం జంక్షన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతలో నాయకత్వ లక్షణాలు పెంచి వారి స్వయం అభివృద్ధికి సాధికారిత కల్పించడం కోసం కేంద్రం మై భారత్ కార్యక్రమాన్ని ప్రారంభించిందని జిల్లా యువజన అధికారి టి.గోపి పేర్కొన్నారు. గురువారం రమణయ్యపేట ఈశ్వర్ నగర్ మోహన్ డిగ్రీ కాలేజీలో మై భారత్ శాఖ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంఎస్ఎంఈ, స్టార్టప్ కంపెనీలు, డీపీఆర్‌లపై ఇండస్ట్రియల్ ప్రమోషన్ ఆఫీసర్ రాజేష్ అవగాహన కల్పించారు. ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ అధికారి సుబ్బారావు, మోహన్ కాలేజీ డైరెక్టర్ వెంకటేష్, మై భారత్ సభ్యులు సత్యసూర్య, చంటిబాబు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం అందజేత

కాకినాడ సిటీ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆఫ్ కాకినాడ సన్‌రైజ్ ఆధ్వర్యంలో నెలవారీ సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం 20 మంది గర్భిణులకు పౌష్టికాహారం, ప్రొటీన్ ఫుడ్, పండ్లు అందజేశారు. కార్యక్రమానికి క్లబ్ అధ్యక్షుడు, సెనేటర్ ఆకుమర్తి శామ్యూల్ అధ్యక్షత వహించారు. గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ముద్రించిన కరపత్రాలను సీడీపీవో కె.జ్యోతి విడుదల చేశారు. క్లబ్ కార్యదర్శి ఎం.విజయలక్ష్మి, కోశాధికారి ఏవీ రంగారావు, మెటర్నల్ అండ్ చైల్డ్ హెల్త్ చైర్‌పర్సన్ కరీమున్నీసా బేగం, క్లబ్ సభ్యులు డీటీటీవీ ఎన్ యాదవ్, పి.కళ్యాణ్, రామన్, ఎంవీ వర్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణ దుర్గాంబ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కొండబాబును సత్కరిస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

కొండబాబును కలిసిన సీరత్ కమిటీ

కాకినాడ సిటీ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కాకినాడ నియోజకవర్గ పరిధిలో సీరత్ కమిటీ అధ్యక్షుడిగా ఎస్‌కే రహీమ్, ఉపాధ్యక్షులుగా షేక్ ముర్తజ, ఎండీ గౌస్ మొహిద్దీన్, ప్రధాన కార్యదర్శిగా షేక్ అష్రఫ్ ఆలీ, సంయుక్త కార్యదర్శిగా ఎంఏ బక్‌త్తర్, ఎం.గాలిబ్, డైరెక్టర్లుగా ఖాసిం సాహెబ్, అబ్దుల్ రహీం, అన్వర్, అహ్మద్ బాషా నియమితులయ్యారు. గురువారం వారు కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబును మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎండీ ఖాన్, ఎండీ అస్సర్, సయ్యద్ ఆలీ, ఖాదర్‌ఖాన్, అక్బర్ బాషా, జారుఖాన్, కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేసే స్కానింగ్ సెంటర్లపై కఠిన చర్యలు

జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ సుబ్బరాజు

కాకినాడ సిటీ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): గర్భస్థ పిండ ఆరోగ్య పర్యవేక్షణకు సంబంధించిన పరీక్షలను లింగ నిర్ధారణకు దుర్వినియోగం కాకుండా అల్ట్రా సౌండ్ స్కానింగ్ సెంటర్లపై పటిష్ట నిఘా పెట్టామని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ కేవీ సుబ్బరాజు పేర్కొన్నారు. గురువారం ఆర్డీవో మల్లిబాబు ఆధ్వర్యంలో వైద్య-ఆరోగ్య, రెవెన్యూ లీగల్, మహిళా-శిశు సంక్షేమ శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలిసి సబ్ డిస్ట్రిక్ట్ లెవెల్ మల్టీ మెంబర్ అప్రొప్రియేట్ అథారిటీ, డివిజన్ స్థాయి ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే స్కానింగ్ సెంటర్లపై కఠిన చర్యలు తీసుకుంటామ న్నారు. జీజీహెచ్ రేడియాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సీహెచ్ ప్రియాంక వన్‌టౌన్ ఎస్ఐ సీహెచ్ కుమార్, డీపీఆర్వో నరేష్, పీడియాట్రిషన్ డాక్టర్ ఎం.కీర్తిప్రియ, ఎన్జీవోలు కె.సింహాద్రి, వరలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ గోవింద్, మోనిటరింగ్ కన్సల్టెంట్ ఎల్.శృతి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఉపాధ్యాయుల శిక్షణ తరగతులు

గొల్లప్రోలు రూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలోని ఉపాధ్యాయులకు స్కూల్ లీడర్‌షిప్ ట్రైనింగ్ ప్రోగ్రాం కింద రెండో విడతగా గొల్లప్రోలు మండలం చేబ్రోలు ఆదర్శ్ ఇంజనీరింగ్ కళాశాలలో నాలుగు రోజులు నిర్వహించిన శిక్షణ తరగతులు గురువారం సాయంత్రం ముగిశాయి. రిసోర్స్‌పర్సన్లుగా వ్యవహరించిన కాజులూరు ఎంఈవో డి.డేవిడ్, రామకృష్ణ, రవికుమార్, సత్యనారాయణ, సత్యవేణి, మూర్తి, శ్రీనివాస్, శాంతిసుప్రియ, వెంకటేశ్వరరావు, సమగ్ర శిక్షా ఏఎంవో జగన్మోహన్ పాల్గొన్నారు.



సుందరీకరించిన పాత ఆశ్రమ ప్రాంగణాన్ని ప్రారంభిస్తున్న ఉమర్‌అలీషా

'ఆధ్యాత్మికతతో పాటు సేవా కార్యక్రమాలు'

పిఠాపురం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): విశ్వ విజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠం ద్వారా ఆధ్యాత్మికతతో పాటు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా తెలిపారు. పట్టణంలోని గోర్స రోడ్డులో సుందరీకరించిన నూతన ఆశ్రమ ప్రాంగణాన్ని, గులాబీ తోట, వేదిక (కుటీరం), నెమలివనం, పేరూరి విక్రమ్ మినీ భోజనశాలలను ఆయన గురువారం ప్రారంభించారు. ఇక నుంచి ప్రతి గురువారం సాయంత్రం 4.30 నుంచి 6.30 గంటల వరకు జ్ఞానచైతన్య సదస్సులు నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మహబూబ్ పాషా, అహ్మద్ ఆలీషా, కబీర్‌షా, పీఠం కన్వీనర్ పేరూరి సూరిబాబు, ఏవీవీ సత్యనారాయణ, ఎంఆర్‌కే రాజు తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఆదిశంకర్, డాక్టర్ స్రవంతి

'నవోదయ'లో ముగిసిన కబడ్డీ పోటీలు

పెద్దాపురం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక జవహర్ నవోదయ విద్యాలయంలో మూడు రోజులు జరిగిన ప్రాంతీయ కబడ్డీ పోటీలు గురువారం ముగిశాయి. ముఖ్య అతిథులుగా హాజరైన లలిత ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మట్టే ఆదిశంకర్, ప్రముఖ వైద్యురాలు మట్టే స్రవంతి విజేతలకు బహుమతులు అందజేశారు. ముగింపు కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పీఎస్ సీతలక్ష్మి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న విశ్రాంత ఉద్యోగులు

అటవీ శాఖ విశ్రాంత ఉద్యోగుల వార్షిక సమావేశం

కార్పొరేషన్ (కాకినాడ), జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అటవీ శాఖ విశ్రాంత ఉద్యోగుల వార్షిక సమావేశం కాకినాడ పెన్షనర్స్ భవన్‌లో బీబీ భ్రమరాంబ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. పెన్షనర్స్ భవనం ట్రెజరర్ వి.శేషగిరి అబ్జర్వర్‌గా విచ్చేశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. వారు చేసిన కార్యక్రమాలు, వాటి ఫలితాలపై చర్చించారు. సీవీ సత్యనారాయణ, డీఎఫ్‌వోలు ఎస్‌వీజీఎంఎస్ రామారావు, కె.పద్మనాభం పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై పోరుకు బసవతారకం ఆసుపత్రి మద్దతు

కాకినాడ సిటీ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్‌పై పోరుకు బసవతారకం ఆసుపత్రి మద్దతు తెలిపిందని టీడీపీ రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు వెల్లడించారు. గురువారం ఆయన బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి చైర్మన్, హిందూపూర్ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, సీఈవో కె.కృష్ణయ్యలతో భేటీ అయ్యారు.



విద్యార్థులకు యూనిఫామ్ అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

విద్యార్థులకు యూనిఫామ్ అందజేత

పిఠాపురం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాదం మాధవరావు ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల ప్లస్ జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యార్థులకు ఇక్కడే పని చేసి ఉద్యోగ విరమణ చేసిన కసా వెంకటరమణమూర్తి యూనిఫారం సమకూర్చారు. వీటిని గురువారం పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ అందజేశారు. పిఠాపురం ఎంఈవో శ్యాంబాబు, నోబుల్ టీచర్ అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షుడు కె.సుబ్రహ్మణ్యం, పీఈటీలు లీల సత్యవతి బేబీ, అనంతలక్ష్మి, రమణమూర్తి కుటుంబసభ్యులు పద్మావతి, నాగరత్నం తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకర్ దాతకు సత్కారం

గొల్లప్రోలు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ప్రజల దాహార్తి తీర్చేందుకు రూ.4లక్షలు విలువైన తాగునీటి ట్యాంకరును విరాళంగా అందించిన కాంట్రాక్టర్ వల్లభశెట్టి సత్యనారాయణను గొల్లప్రోలు నగర పంచాయతీ కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు సత్కరించారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ గండేపల్లి సూర్యావతి, శ్రీరామచంద్రమూర్తి, మొగలి అయ్యారావు, కమిషనరు కనకారావు తదితరులు పాల్గొన్నారు.

హైస్కూల్‌కు రూ.65వేలు అందజేత

కిర్లంపూడి, జూలై31(ఆంధ్రజ్యోతి): స్థానిక విజ్ఞానభారతి హైస్కూల్‌కి ఫర్నిచర్ కోసం విశ్వహిందూ పరిషత్ జగ్గంపేట ప్రఖండ అధ్యక్షుడు, జనసేన నాయకుడు పాటోలు స్వామి రూ.65వేలు సమకూర్చారు. జనసేన జగ్గంపేట ఇన్‌చార్జి తులమ్మలపల్లి రమేష్ గురువారం హైస్కూల్ హెచ్‌ఎం శ్రీనివాస్‌కు రూ.65వేలు అందజేశారు. ముక్కు సుబ్రహ్మణ్యం, బాదంపూడి సూర్యనారాయణమూర్తి, దాడి సూరిబాబు, ఎల్లపు దొరబాబు, గంధం ప్రభాకర్, చిక్కాల కల్కి, భగవాన్ పాల్గొన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక



గోపవరంలో కరపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే శిరీషదేవి

సుపరిపాలనే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే శిరీషదేవి..గోపవరంలో సుపరిపాలనలో తొలి అడుగు

రంపచోడవరం, జూలై 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సుపరిపాలనే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి అన్నారు. గురువారం మండలంలోని గోపవరం గ్రామంలో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పనులపై వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కారం సురేష్‌బాబు, అడబాల బాపిరాజు, పెంటపాటి అనంతమోహన్, దిండి జనార్ధన్, కారం సింహాచలం, చవలం బాపిరాజు, వైనిరంజనీదేవి, ఏఎంసీ చైర్మన్ లోత లక్ష్మణరావు, వైస్ చైర్మన్ సలాది బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

చదలవాడలో గ్రామసభ

మోతుగూడెం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): చదలవాడలో ఎంపీడీవో ఎంపీడీవో శ్రీనివాస్ దొర ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా అసంపూర్తిగా ఉన్న చదలవాడ-తులసిపాక రహదారి నిర్మాణం, గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని, పాఠశాలకు భవనాలకు తక్షణమే మరమ్మతులు చేయాలని గ్రామస్థులు వివరించారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఈఈ వేణు, ఎంఈవో జి.వెంకటేశ్వరరావు, డిప్యూటీ ఎంపీడీవో జి.మోహన్, ఏపీఎం సుధాకర్, ఆర్‌డబ్ల్యూస్ డీఈ, ఏపీవో నరేష్ తదితరులు పాల్గొన్నారు.

గడి బాపనమ్మ ఆలయ ట్రస్ట్ చైర్మన్‌గా బాపన్నదొర

రంపచోడవరం, జూలై 31(ఆంధ్రజ్యోతి): సీతపల్లి గడి బాపనమ్మ ఆలయ నూతన ట్రస్టు బోర్డు సభ్యులను ప్రభుత్వం నియమించింది. నూతన చైర్మన్‌గా కుంజం బాపన్నదొర, సభ్యులుగా సిద్ద వెంకన్న, సుంకర పెంటమ్మ, బొగ్గుల లక్ష్మి, కారు లక్ష్మి, భవాని, మచ్చా అబ్బులు, కాళ్ళకూరి సత్య సుందరరావు, కొరువాడ బాబురావు గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే శీతంశెట్టి వెంకటేశ్వరరావు, కారం సురేష్‌బాబు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

సీపీఐ మహాసభలను జయప్రదం చేయండి

చింతూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 8,9 తేదీల్లో రంపచోడవరంలో జరిగే సీపీఐ రెండో మహాసభలను జయప్రదం చేయాలని చింతూరు డివిజన్ కార్యదర్శి గుజ్జా మోహనరావు కోరారు. ఈ మేరకు శుక్రవారం చింతూరులో సీపీఐ నాయకులు ప్రచారం చేపట్టారు. ప్రజా సమస్యల పరిష్కార దిశగా సీపీఐ గడచిన వందేళ్లలో అలుపెరగని పోరాటం చేసిందన్నారు. కార్యక్రమంలో ఎస్కే రంజాన్, తుర్రం మురళి తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీలకు వంద శాతం రిజర్వేషన్లు కల్పించాలి

కూనవరం, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఈ నెల 9న ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఏజెన్సీలో ఆదివాసీలకు వందశాతం రిజర్వేషన్లు కల్పించేలా ప్రభుత్వం ప్రకటించాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పులి సంతోష్ అన్నారు. స్థానిక సీపీఎం పార్టీ కార్యాలయంలో జరిగిన గిరిజన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జీవో 3కి బదులు మరో జీవో తెచ్చి ఆదివాసీలకు వంద శాతం రిజర్వేషన్లు ప్రకటించాలన్నారు. మెగా డీఎస్సీలో ఏజెన్సీ పోస్టులు మినహాయించకపోవడంతో నిరుద్యోగ యువతకు అన్యాయం జరిగిందన్నారు. లేదన్నారు. కార్యక్రమంలో బాబు బొర్రయ్య, పాయం సీతారామయ్య, బొగ్గ రామారావు, తెల్లం తమ్మయ్య ఉన్నారు.

ముసురుమిల్లి రైతులకు సాగు నీరందించాలి

దేవీపట్నం, జూలై 31(ఆంధ్రజ్యోతి): ముసురుమిల్లి ప్రాజెక్టు కాలువకు పూడికతీసి మండలంలోని దేవారం, శరభవరం భూములకు సాగునీరందించాలని ఏపీ ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ డిమాండ్ చేశారు. బుధవారం దేవారం, కమలంపాలెం గ్రామాల రైతులు స్వచ్ఛందంగా ముసురుమిల్లి ప్రాజెక్టు కాలువలో ఉన్న గడ్డి, గుర్రపుడెక్కను తొలగించారు. కాగా ఆగస్టు నెల వచ్చినా ప్రాజెక్టు నీరు రైతుల పొలాల్లోకి చేరలేదని, ఆకుమడులు ఎండిపోతున్నాయన్నారు. దీనిపై ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి స్పందించి సాగునీరందించి రైతులను ఆదుకోవాలని కోరారు.

మర్రిగూడెంలో పారిశుధ్య పనులు

కూనవరం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్రిగూడెం పంచాయతీ మర్రిగూడెం, గొమ్మగూడెం, కొమరస్వామి గూడెం గ్రామాల్లో గురువారం పారిశుధ్య పనులు చేపట్టారు. వర్షాకాలం కావడంతో వ్యాధులు ప్రబలకుండా ఈ పనులు చేపట్టినట్టు కార్యదర్శి టి.రాజాబాబు తెలిపారు.

నిబద్ధతతో పనిచేస్తే గుర్తింపు: ఐటీడీఏ పీవో

రంపచోడవరం, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు వృత్తి పట్ల నిబద్ధతో పనిచేస్తే ప్రజల్లో గుర్తింపు ఉంటుందని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం అన్నారు. గురువారం స్థానిక ఆర్‌పీ ఫంక్షన్ హాల్లో జీసీసీ డివిజనల్ మేనేజర్‌గా పనిచేస్తూ పదవీ విరమణ పొందిన పార్వతీశ్వరరావు దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో ఎస్‌డీపీవో సాయిప్రశాంత్, డీడీ రుక్మాండయ్య, సబ్ డీఎఫ్‌వో అనూష, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మోతుగూడెం: మోతుగూడెం జడ్పీ హైస్కూల్లో ప్రధానోపాధ్యాయుడు వీవీఎస్ఎన్ మూర్తి పదవి విరమణ సన్మాన కార్యక్రమం జరిగింది. పలువురు ఆయన సేవలను కొనియాడారు.

శక్తి యాప్‌తో మహిళలకు భద్రత

ఎటపాక, జూలై 31(ఆంధ్రజ్యోతి): మహిళల, యువతుల భద్రత, రక్షణకు శక్తి యాప్ దోహదపడుతుందని, ఈ యాప్‌ను అందరూ డౌన్‌లోడ్ చేసుకోవాలని ఎస్ఐ అప్పలరాజు చెప్పారు. గురువారం లక్ష్మీదేవిపేటలోని డా.పాల్‌రాజ్ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థినులకు శక్తియాప్‌పై అవగాహన కలిగించారు. అత్యవసర, ప్రమాద సమయంలో మహిళలు శక్తి యాప్‌లో, టోల్ ఫ్రీ నెంబర్ 112ను సంప్రదించవచ్చునన్నారు.

అక్రమ మైనింగ్‌పై చర్యలు తీసుకోవాలి

రంపచోడవరం, జూలై 31(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో అక్రమ మైనింగ్‌పై చర్యలు తీసుకోవాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో గురువారం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలాన్ని కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను మాట్లాడుతూ ఏజెన్సీలో అక్రమంగా మెటల్ క్వారీ, గ్రానైట్, రంగురాళ్లు, గ్రావెల్ జరుగుతున్నాయని వీటన్నింటిపై సమగ్ర విచారణ జరిపి తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు తీగల బాబురావు, మోడిద నూకరాజు, చోడి ప్రదీప్‌దొర, గంగాల అబ్బాయిదొర, పీక ప్రసాద్, చోడి ఏడుకొండలు ఐటీడీఏ పీవోను కలిసిన వారిలో ఉన్నారు.

గుంతలో ఇరుక్కున్న ఇసుక లారీలు

ఎటపాక, జూలై 31 (ఆంధ్రజ్యోతి): రెండు ఇసుక లారీలు గుంతలో ఇరుక్కుపోయిన ఘటనలో విద్యార్థులకు త్రుటిలో ప్రమాదం తప్పింది. గురువారం తెలంగాణలోని భద్రాద్రి జిల్లా చర్ల మండలంలోని ఇసుక ర్యాంపుల నుంచి వస్తున్న రెండు లారీలు ఓవర్‌టెక్ చేసుకునే క్రమంలో ఎటపాక పోలీస్‌స్టేషన్ వద్దకు వచ్చేసరికి ఓ లారీ గుంతలో ఇరుక్కుంది. వెనుక నుంచి వస్తున్న మరో లారీ గమనించక ముందుకు వచ్చింది. సరిగ్గా భద్రాచలం నుంచి కన్నాయిగూడెం వైపు పాఠశాల విద్యార్థులతో వస్తున్న ఆటో వద్దకు వచ్చి నిలిచిపోయింది. దీంతో చర్ల-భద్రాచలం రోడ్డులో అరగంటపాటు ట్రాఫిక్ స్తంభించిపోయింది. పోలీసులు వచ్చి పరిస్థితిని చక్కదిద్దారు.

రామేశ్వరంపేటలో గ్రావెల్ అక్రమ తవ్వకాలు

- మెట్టను వీడని గ్రావెల్ మాఫియా
- అనుమతులు లేకుండానే తవ్వకాలు
- పట్టించుకోని అధికారులు



రామేశ్వరంపేటలో గ్రావెల్ అక్రమంగా తవ్వుతున్న దృశ్యం

గండేపల్లి, జూలై 31(ఆంధ్రజ్యోతి): సూరంపాలెం గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న రామేశ్వరంపేట గుల్లమెట్టపై కొన్ని రోజులుగా అరకొర అనుమతులతోనే కొందరు అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు చేపడుతున్నారు. ఈ విషయం తెలిసినా అధికారులు పట్టించుకోకపోవడంతో విమర్శలు వినిపిస్తున్నాయి. గుల్లమెట్ట 202/3సర్వే నెంబర్‌లో 216ఎకరాల్లో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్ల పగలు, రాత్రి తేడా లేకుండా తవ్వేశారు. భారీగా తవ్వకాలు చేసి కోట్ల రూపాయలు సొమ్ము చేసుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రావెల్ అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట వేసింది. మళ్లీ ఇప్పుడు కొందరు మెట్టపై కన్నేసి అరకొర అనుమతులతో గ్రావెల్ తవ్వకాలు నిర్వహిస్తూ ప్రభుత్వ సొమ్ముకు గండి కొడుతున్నప్పటికీ సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించడంపై పలువురు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అక్రమ తవ్వకాలు నిలుపుదల చేయాలని ప్రజలు కోరుతున్నారు.

బాలల పరిరక్షణ, చట్టాలపై శిక్షణ

తునిరూరల్, జూలై 31(ఆంధ్రజ్యోతి): తునిలో గురువారం ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి కె.శ్రీలత అధ్యక్షతన బాలల సంక్షేమ, పరిరక్షణ కమిటీ అధికారులకు బాలల పరిరక్షణ, చట్టాలపై శిక్షణ ఇచ్చారు. సీడీపీవో శ్రీలత మాట్లాడుతూ బాల్యవివాహాలను నిర్మూలించాల్సిన బాధ్యత గ్రామ, వార్డు స్థాయి కమిటీ అధికారులందరికీ ఉందన్నారు. ఎవరైనా బాల్య వివాహాలు నిర్వహిస్తే వారిపై చర్యలు తీసుకోవడంతో ప్రభుత్వం నుంచి పొందే అన్ని పథకాలు రద్దు చేస్తామన్నారు. జిల్లాల బాలల రక్షణ అధికారి కె.శ్రీనివాసరావు, చైల్డ్ హెల్ప్‌లైన్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు, ఏసీడీపీవో కె.శ్రీకళ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌కు ప్రింటర్ బహూకరణ



కోటనందూరు, జూలై31(ఆంధ్రజ్యోతి): కోటనందూరు పోలీస్‌స్టేషన్‌కు జగన్నాథపురం గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నేత మాతిరెడ్డి భాస్కరరావు ప్రింటర్‌ను బహూకరించారు. టీడీపీ సీనియర్ నేతలు గాడి రాజుబాబు, డి.చిరంజీవిరాజు గురువారం ప్రింటర్‌ను ఎస్ఐ టి.రామకృష్ణకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గొర్లి అచ్చియ్య నాయుడు, మాతిరెడ్డి బాబులు, గుడివాడ శ్రీనివాస్, గుడివాడ నాని తదితరులు పాల్గొన్నారు.

ఒమ్మంగిలో ఆక్రమణలు తొలగించాలని వినతి

ప్రత్తిపాడు, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఒమ్మంగి గ్రామంలో వినాయకుడి గుడి ఎదురుగా ప్రభుత్వ ఖాళీ స్థలంలో ఆక్రమణలను తొలగించాలని ఆ గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ రాయుడు రాజబాబు, ఎం.సూరిబాబు, ఎం.కామేశ్వరరావు, పలివెల సత్తిబాబు, మొండి త్రిమూర్తులు, మరో 25 మందికి గురువారం ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. ఈప్రభుత్వ స్థలంలో దైవ కార్యక్రమాల నిర్వహణకు గ్రామస్థులు వినియోగించుకుంటుండగా ఈస్థలాన్ని ఆక్రమణలకు పాల్పడుతున్నారని వారు ఎంపీడీవోకు వివరించారు. స్థలాన్ని ఆక్రమించుకోవడమే కాకుండా వ్యాపారాలు నిర్వహించేందుకు బడ్డీ ఏర్పాటు చేశారని, ఈఆక్రమణలు తొలగించాలని ఎంపీడీవోను కోరారు.

చినశంకర్లపూడి పాఠశాలను సందర్శించిన అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



పాఠశాలను సందర్శించిన తహసీల్దార్ సూర్యప్రభ, ఎంపీడీవో కుమార్‌బాబు, ఎంఈవో రాజబాబు

ప్రత్తిపాడు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పాఠశాలను పట్టించుకోరా అంటూ గురువారం చినశంకర్లపూడి పాఠశాల దుస్థితిపై వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. తహసీల్దార్ ఎం.సూర్యప్రభ, ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్‌బాబు, డిప్యూటీ ఎంపీడీవో కాశీవిశ్వనాథ్, ఎంఈవో వి.రాజబాబు, ఇతర అధికారుల బృందం, పోలీసులు చినశంకర్లపూడి పాఠశాలకు తరలివెళ్లారు. మురుగునీటి ముంపునకు గురవుతున్న పాఠశాల ప్రధాన సమస్య పరిష్కారంలో భాగంగా పాఠశాల వెనుక నుంచి ప్రత్యేక డ్రైన్ నూతనంగా ఎక్స్‌కవేటర్ సహాయంతో నిర్వహించే పనులను అధికారులు ప్రారంభించారు. అలాగే పాఠశాల ప్రాంగణంలో కూలడానికి సిద్ధంగా ఉన్న శిథిల పాఠశాల భవనాన్ని కూ ల్చేందుకు అధికారులు నిర్ణయించారు. దీనిపై సంబంధిత మండల ఇంజనీర్ అధికారులకు ఆదేశించారు. ప్రాథమిక పాఠశాల భవనాల నిర్మాణానికి అంచనాలు రూపొందించాలని అధి కారులు ఆదేశించారు. అనంతరం పాఠశాలలో అమలు జరుగుతున్న మధ్యాహ్న భోజన పథ కాన్ని అధికారులు పరిశీలించారు. కార్యక్రమంలో కార్యదర్శులు బి.వీరబాబు, చెల్లుబోయిన వేణుగోపాల్, జ్యోతుల పద్మరాజు, ఎం.లక్ష్మినారాయణ, నాగార్జున, కె.తేజ ప్రతాప్ పాల్గొన్నారు.

అంకిత భావంతో పనిచేసిన వారికి గుర్తింపు



డిప్యూటీ ఎంపీడీవో సూర్యభాస్కరరావు దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

జగ్గంపేట, జూలై 31(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో చేసిన సేవలే గుర్తింపునిస్తాయని ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త వెంకటేశ్వరరావు, ఎంపీపీ అత్తులూరి నాగబాబు, టీడీపీ మండల అధ్యక్షుడు మారిశెట్టి భద్రం అన్నారు. డిప్యూటీ ఎంపీడీవోగా పనిచేసిన సూర్యభాస్కరరావు గురువారం ఉద్యోగ విరమణ చేశారు. స్థానిక గోకవరం రోడ్డులోని శివపార్వతి ఫంక్షన్‌హాల్‌లో ఎంపీడీవో ఏవీఎస్ చంద్రశేఖర్ అధ్యక్షతన నిర్వహించిన సన్మాన సభకు పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు హాజరయ్యారు. ఈసందర్భంగా సూర్యభాస్కరరావు, నాగ సుజాత దంపతులను పలువురు సత్కరించి జ్ఞాపిక అందించారు. సూర్యభాస్కరరావు ఉద్యోగ బాధ్యతలను అంకిత భావంతో నిర్వహించారని కొనియాడారు. కార్యక్రమంలో జగ్గంపేట, గండేపల్లి ఏపీవోలు, జగ్గంపేట పంచాయతీ సెక్రటరీ శివ, రాజపూడి, మల్లిశాల, సర్పంచ్‌లు బుసాల విష్ణుమూర్తి, సర్వసిద్ధి లక్ష్మణరావు, సర్పంచులు, టీడీపీ నాయకులు, మండలంలోని పంచాయతీ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

'ఆదిత్య'లో ఈఈఈ విభాగంలో గెస్ట్ లెక్చర్

గండేపల్లి, జూలై 31(ఆంధ్రజ్యోతి): సూరంపాలెంలో ఆదిత్య యూనివర్సిటీలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో ఎలిమెంటరీ ఫండమెంటల్స్ ఆఫ్ ఎంబెడెడ్ సిస్టమ్స్ అనే అంశంపై గెస్ట్ లెక్చర్‌ను నిర్వహించినట్లు కళాశాల ప్రో వైస్ చాన్సలర్ డాక్టర్ ఎ.రమేష్ తెలిపారు. ఈసదస్సుకు ముఖ్య అతిథిగా మైక్రో లింక్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఎండీ వి.గోవిందరావు హాజరై విద్యార్థులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు.

కామ్రేడ్ నాగయ్యకు విప్లవ జోహార్లు

జగ్గంపేట, జూలై 31(ఆంధ్రజ్యోతి): పీడీఎస్‌యూ విజృంభణ విద్యార్థి నాయకుడిగా విప్లవ జీవితం ప్రారంభించిన కామ్రేడ్ మచ్చ నాగయ్యకు గురువారం రామవరం గ్రామం రంగవల్లినగర్‌లో ఆంధ్రప్రదేశ్ రైతు-కూలీ సంఘం, పీడీఎస్‌యూ సంఘాలు విప్లవ జోహార్లు అర్పించాయి. పీడీఎస్‌యూ విజృంభణ రాష్ట్ర కార్యదర్శి కడితి సతీష్, అర్జున్, లక్ష్మి, వీరబాబుపాల్గొన్నారు.

కారు దగ్ధం



మంటలను అదుపుచేస్తున్న దృశ్యం

తునిరూరల్, జూలై 31(ఆంధ్రజ్యోతి): తుని పట్టణంలోని ఎల్ఐసీ బిల్డింగ్ వద్ద గురువారం ఉదయం పార్కింగ్ చేసిన కారు దగ్ధమైంది. కారు సమీపంలో చెత్తకు నిప్పుపెట్టగా అది గమనించని కారు ఓనర్ ఆ చెత్తకు సమీపంలో కారును పార్కింగ్ చేశారు. దీంతో ఆ మంట వ్యాపించి కారు ముందు భాగం మొత్తం దగ్ధమైంది. అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

ఈగల్ క్లబ్‌లు ఏర్పాటు చేయాలి

జగ్గంపేట, జూలై 31(ఆంధ్రజ్యోతి): ప్రతి ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో ఈగల్ క్లబ్‌లు ఏర్పాటు చేసినట్లు సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ తెలిపారు. కిర్లంపూడి, జగ్గంపేట, గండేపల్లి మండలాల మహిళా సంరక్షణ కార్యదర్శులకు (మహిళా పోలీసులకు) జగ్గంపేట సర్కిల్ కార్యాలయం వద్ద నిర్వహించిన మోటివేషన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళా పోలీసులు తరచూ విద్యాసంస్థలను విజిట్‌చేస్తూ ఈగల్ క్లబ్ సభ్యులతో మమేకమై విద్యా సంస్థలు, పరిసరాల్లో గంజాయి, మత్తు పానియాల వినియోగం లేకుండా చూడాలన్నారు. జగ్గంపేట, కిర్లంపూడి గండేపల్లికి చెందిన జగ్గంపేట సర్కిల్ జీఎంఎస్‌కేలు (మహిళా పోలీసులు) పాల్గొన్నారు



వరినాట్లకు నారు తీస్తున్న కూలీలు

ముమ్మరంగా వరినాట్లు

కిర్లంపూడి, జూలై 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో పొలం పనులు ఊపందుకున్నాయి. కాలువల వెంబడి భారీగా నీరు పారడంతో వరినాట్లు వేసేందుకు రైతులు సిద్ధమయ్యారు. నారుమళ్లు వేసి వరినాట్లు ప్రారంభించారు. వర్షాకాలం అయినప్పటికీ ఎండలు మండుతుండడంతో రైతులు ఏలేరు కాలువ నీటిపై ఆధారపడి పనులు ప్రారంభించారు. జోరుగా వర్షాలు పడినట్టయితే తమ పంటలు ఎండిపోకుండా చేతికొస్తాయని ఆయా ప్రాంత రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ముద్రగడ ఆరోగ్యం మెరుగుపడాలని పూజలు

ప్రత్తిపాడు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం ఆరోగ్యం పెరుగుపడాలని కోరుతూ గురువారం గజ్జనపూడి గ్రామంలో సర్పంచ్ గొనగాల అప్పలరాజు పూజలు జరిపారు. ఆయన సంపూర్ణ ఆరోగ్యంతో ఇంటికి రావాలని ఆకాంక్షించారు. ఆయనతో పాటు శాలివాహన కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ అనకాపల్లి నూకరాజు, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు అల్లు సత్తిబాబు, స్థానిక పెద్దలు గొనగాల దేవళ్ళు, బర్ల చక్రం తదితరులు పాల్గొన్నారు. రాచపల్లి అరుణాచలేశ్వర ఆలయంలో ప్రత్తిపాడుకు చెందిన నేతి వెంకటేశ్వరరావు, కుమారి దంపతులు ముద్రగడ ఆరోగ్యం బాగుపడాలని పూజలు చేశారు.

త్వరగా కోలుకోవాలని ప్రార్థనలు

కిర్లంపూడి, జూలై 31(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత ముద్రగడ పద్మనాభం త్వరగా కోలుకోవాలని కోరుతూ గురువారం కిర్లంపూడి ఎస్సీపేటలోని ఆర్‌సీఎం చర్చిలో ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో రెవరెండ్ ఫాదర్ కె.చిన్నప్ప, సంఘ పెద్దలు ఉన్నారు.

ఆసుపత్రి నుంచి డిశ్చార్జి: మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం అనారోగ్యానికి గురై కాకినాడ మెడికవర్ ఆసుపత్రిలో చికిత్స పొందారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం హైదరాబాద్ యశోద ఆసుపత్రిలో చేరారు. ఆరోగ్యం కుదుటపడడంతో గురువారం ఆయన ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయ్యారు. హైదరాబాద్‌లో విశ్రాంతి కోసం కుటుంబ సభ్యులతో ఉన్నారు.

సీసీ రోడ్లకు శంకుస్థాపన



తొండంగి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఏ కొత్తపల్లి గ్రామంలో నిర్మించనున్న సిమెంట్ రోడ్లకు టీడీపీ సీనియర్ నేత యనమల రాజేష్, యనమల నాగేశ్వరరావు గురువారం శంకుస్థాపన చేశారు. ఉపాధి హామీ నిధులతో దీన్ని నిర్మించనున్నారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ఎమ్మెల్యే యనమల దివ్య అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. ఇందులో భాగంగా అన్ని గ్రామాల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ నేతలు వనపర్తి రాజా, వనపర్తి చిట్టిబాబు, సోము రమణ, నరాల సోమరాజు , అరిగెల నర్సింహమూర్తి, సంగిశెట్టి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

దళితుల మధ్య ఐక్యతను దెబ్బతీసే కుట్ర



ప్రత్తిపాడులో మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు రత్నాకర్ మాట్లాడుతున్న దృశ్యం

ప్రత్తిపాడు, జూలై 31(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా దళితుల మధ్య ఐక్యతను దెబ్బతీసే కుట్ర జరుగుతుందని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు ఆర్ఎస్ రత్నాకర్ ఆరోపించారు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడులో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో రత్నాకర్ మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ పేరుతో అన్నదమ్ములుగా ఉండే దళితుల మధ్య చిచ్చుపెట్టి విడదీసే కుట్రకు పాల్పడుతున్నారని ఆరోపించారు. రాజకీయ పార్టీలు మాలసామాజిక వర్గాన్ని అణచివేయాలని చూస్తుంటే ప్రజా ప్రతినిధులు నోరు మెదపకపోవడం అన్యాయమన్నారు. మాలసామాజిక వర్గం ఉనికిని కాపాడుకునేందుకు శాంతియుతంగా చేసే తమ పోరాటానికి ఉద్యోగులు, సామాజిక వర్గీయులు సహకరించాలని కోరారు. సమావేశంలో ఎ.సత్తిబాబు, కొప్పున శ్రీనుబాబు, పూసి కొండబాబు, నెల్లి సూరిబాబు, తనికెళ్ళ నాని తదితరులు పాల్గొన్నారు.

సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి విరాళం



ఈవో సుబ్బారావుకు విరాళం అందజేస్తున్న దాత

అన్నవరం, జూలై 31(ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి గురువారం ఒకదాత రూ.లక్ష విరాళంగా ఇచ్చారు. తణుకు ప్రాంతానికి చెందిన మానేపల్లి సాయిబాబా ఈ మొత్తాన్ని ఆలయ ఈవో వీర్ల సుబ్బారావుకు అందజేయగా దాతను ఆయన అభినందించి స్వామివారి దర్శనం, ప్రసాదం అందజేశారు.

ఖడ్గమాల పూజల కోసం అభిప్రాయ సేకరణ: వనదుర్గ ఆలయంలో త్వరలో ఖడ్గమాల పూజలు ప్రారంభించాలనే ఆలోచనతో భక్తులు, గ్రామస్థుల నుంచి సలహాలు, సూచనలు తీసుకునేందుకు నిర్ణయించారు. దీనికి సంబంధించి టిక్కెట్టు వెల రూ.1,116 నిర్ణయించినట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. భక్తుల అభిప్రాయాల మేరకు ఖడ్గమాల పూజలు నిర్వహించనున్నామని భక్తులు 30 రోజుల్లోగా తమ అభిప్రాయం తెలపాలని కోరారు.

సర్వర్ సమస్యతో ఇబ్బందులు: సత్యదేవుడి సన్నిధిలో సర్వర్ సమస్యతో గురువారం భక్తజనం ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గదుల కేటాయింపు, వ్రతం, ప్రత్యేక దర్శనం, ఇతర వాటి కోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను ఏర్పాటు చేయగా ఇదంతా విజయవాడ నుంచి సెంట్రలైజ్డ్ కానుంది. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు సర్వర్ ఇబ్బందులు తలెత్తగా సాయంత్రం 5 గంటల తర్వాత అందుబాటులోకి వచ్చాయి. అన్నవరం దేవస్థానంలో వచ్చిన సమస్య కాదని, ప్రధాన కార్యాలయం నుంచి వచ్చిన సమస్యని వారు తెలిపారు. అన్ని ఆలయాల సేవలకు అంతరాయం కలిగిందని అధికారులు వివరణ ఇచ్చారు.

స్వయం ఉపాధి కల్పనే లక్ష్యం

ఏలేశ్వరం, జూలై 31(ఆంధ్రజ్యోతి): మహిళలకు ఉపాధి కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని గురువారం ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా మహిళా సంఘాలకు ఉచితంగా శిక్షణ ఇస్తున్న కుట్టుమిషన్ల కేంద్రాన్ని ఆయన సందర్శించారు. శిక్షణలో మహిళలు కుట్టిన దుస్తులను పరిశీలించారు. ఎంపీటీసీ సభ్యుడు కొప్పుల బాబ్జి, పసల సూరిబాబు, టీడీపీ నాయకులు చిక్కాల లక్ష్మణరావు, శెట్టి చిన్న, చింతలపాటి బాబ్జి పాల్గొన్నారు.



ఏలేశ్వరంలో మహిళలు కుట్టిన దుస్తులను పరిశీలిస్తున్న ఎంపీపీ బుజ్జి



గోకవరంలో 3వ రోజు రిలే దీక్షలు చేపట్టిన రైతులు

కొనసాగుతున్న రైతుల రిలే దీక్ష

ప్రత్తిపాడు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇ.గోకవరం గ్రామంలో బాధిత రైతు సత్తి వినోద్‌కుమార్ రెడ్డి, పలువురు మద్దతుగా రైతులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష ఆందోళన గురువారం 3వ రోజుకు చేరుకుంది. గోకవరం గ్రామంలోని తాను సాగు చేపట్టిన పొలంలో అరటి, కొబ్బరి తోటలు నరికివేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బాధిత రైతు సత్తి వినోద్‌కుమార్‌రెడ్డి రైతుల మద్దతుతో ఆందోళన కొనసాగిస్తున్నారు. తనకు న్యాయం జరిగే వరకు రిలే దీక్షలు కొనసాగిస్తామని ఆయన తెలిపారు. ఆందోళన శిబిరం వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

వైద్య శిబిరంలో 600 మందికి పరీక్షలు

ప్రత్తిపాడు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు అఖిల్ విద్యా సంస్థల ప్రాంగణంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని అఖిల్ విద్యా సంస్థల అధినేత ఇనకోటి గంగాధర్ ప్రారంభించారు. డాక్టర్ అగర్వాల్ కంటి ఆసుపత్రి, సత్యం ఐ కేర్ ఆస్పత్రుల ఆధ్వర్యంతో 600 మందికి ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.